

రాజ యోగం
పతంజలి యోగదర్శనము
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్ధులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# పాతఞ్జల యోగదర్శనము

వ్యాఖ్యాత

డా॥ ధూళిపాళ అర్కసోమయాజీ

ప్రచురణ:
తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు
శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్. గారిచే
తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూధర్మ రక్షణసంస్థ తరఫున
ప్రకటింపబడినది.
1973

# ఉపోద్ఘాతము

* * *

అమూల్య విజ్ఞాన ప్రతిపాదకములైనట్టియు, పతఞ్జలి మహర్షి ప్రణీతములైనట్టి యోగసూత్రములకు ఆంధ్రదేశమందు తగినంత ప్రచారము లేకపోవుట శోచనీయము. ఈ చిన్ని పొత్తమునందు గుర్వపేక్షలేకుండ ఆబాలగోపాలము యోగశాస్త్రవిషయమును గ్రహించు విధమున తేటతెనుగున సూత్రార్థము వ్యాకరింపఁబడినది. అముఖ్యసూత్రములను కొన్నిటిని విడచి, ముఖ్యసూత్రములకు తాత్పర్యము వ్రాయఁబడినది.

విజ్ఞానకందమైన సంస్కృత వాఙ్మయమందు షడ్దర్శనములను ఆధ్యాత్మిక తత్త్వబోధకశాస్త్రములు గలవు. న్యాయవైశేషికములు, సాంఖ్యయోగములు, పూర్వోత్తరమీమాంసలు అను పేరిట నా యాఱు దర్శనములను మూఁడు జంటలుగ పండితులు విభజించిరి. సాంఖ్యశాస్త్రము, యోగశాస్త్రము సన్నిహిత సంబంధముగలవి. ప్రకృతియే సృష్టికర్త్రియని సాంఖ్యముజెప్పగా, ఈశ్వరుఁడు గూడ కలడని యోగశాస్త్రము జెప్పుటచేత, సాంఖ్యము నిరీశ్వరశాస్త్రమని, యోగము సేశ్వరసాంఖ్యశాస్త్రమని ఈ ప్రకారము సాంఖ్యయోగశాస్త్రములు, కించిద్భేదము గలిగియున్నవి. భగవదవతారమూర్తి యని వర్ణింపఁబడిన కపిలమహర్షి సాంఖ్యశాస్త్రమునకు మూలకర్త. యోగశాస్త్రమునకు పతఞ్జలిమహర్షి మూలకర్త.

యోగేన చిత్తస్య పదేన వాచాం, మలం శరీరస్య చ వైద్యకేన ।
యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం, పతఞ్జలిం ప్రాఞ్జలిరానతోఽస్మి ॥

అను వృద్ధకారిక ననుసరించి, పతఞ్జలి మహర్షి మనోమలమును యోగశాస్త్రముచేత, అపశబ్ద ప్రయోగమను మలమును వ్యాకరణమహాభాష్య రచనచేతను, శరీరమలమును కొండొక వైద్య గ్రంథముచేతను అపాకరించెనట. ఇందు యోగశాస్త్రము, వ్యాకరణమహాభాష్యము ప్రచారములో నున్నవేగాని వైద్యశాస్త్ర గ్రంథమేదియో మనకుపలబ్ధముగాలేదు. చారిత్రకులు పతఞ్జలి క్రీస్తుపూర్వము

మూడవశతాబ్దము వాఁడని జెప్పుచున్నారు. ఈ మహర్షి ఆదిశేషుని యవతార మని పండితుల విశ్వాసము.

యోగసూత్రములకు వ్యాసభాష్యమను పేరిట ఒక భాష్యమును, బహు శాస్త్రవేత్తయగు వాచస్పతి మిశ్రునియొక్క వ్యాసభాష్యవ్యాఖ్యానమును, భోజ రాజవిరచితమైన వృత్తిగ్రంథము ప్రచారములో నున్నవి.

యోగశాస్త్ర ప్రతిపాదితమైన తత్త్వ మీక్రింది విధమున నున్నది:

వాసుదేవుఁడు పరబ్రహ్మయనియు, పరమేశ్వరుఁడనియు, లేక పురుషోత్తముఁడనియు వ్యవహరింపఁబడును (Supreme Consciousness) ఈ వాసుదేవునికి సిసృక్ష యనగా సృష్టిజేయవలయునని సంకల్పము కలిగినప్పుడు, అతని నుండి సంకర్షణ నామముగల ఒక యంశముదయించి, ప్రకృతి పురుష లలో క్షోభ జనింపఁజేయును. సృష్టికి పూర్వము ప్రకృతి లేక ప్రధానము (దీనినే అవ్యక్తమని గూడ పరిభాషింతురు) సత్త్వరజస్తమో గుణముల సామ్యముగలిగి యుండును. ఈ ప్రకృతిని నిండి కూటస్థుఁడు లేక అక్షర పురుషుఁడు (Cosmic consciousness) గలఁడు. పైనఁజెప్పఁబడిన సంకర్షణాంశము గుణసామ్య మందున్న ప్రకృతికిని, కూటస్థ అక్షరపురుషునికి మధ్య క్షోభ జనింపఁజేయును. క్షోభ యనగా సత్త్వరజస్తమో గుణములయందు వైషమ్యము కలుగజేయును. ఈ క్షోభవలన మహత్ (Supreme Intelligence) అనగా ప్రద్యుమ్నాంశమనఁబడు బుద్ధితత్త్వముదయించును. ఈ మహత్తత్త్వము వికారమునొందగా అనిరుద్ధాంశ మనెడు అహంకారము (Cosmic Egoism) జనించును. ఈ అహంకారము మూడు విధములు (1) సత్త్వప్రధానము లేక వైకారికము, (2) రజః ప్రధానము లేక తైజసము, (3) తమఃప్రధానము లేక భూతాది. తామసాహంకారము నుండి శబ్దతన్మాత్రము అనగా శబ్దగుణము యొక్క అతిసూక్ష్మ రూపావస్థ (Primary cause of Akās'a) ఈ శబ్దతన్మాత్రనుండి ఆకాశమను మహాభూతము, ఆకాశమునుండి స్పర్శతన్మాత్ర (స్పర్శగుణము యొక్క సూక్ష్మరూపావస్థ) దానినుండి వాయువను మహాభూతము, ఈ వాయువునుండి రూపతన్మాత్ర, దానినుండి అగ్ని యను మహాభూతము, దానినుండి రసతన్మాత్ర, ఈ రసతన్మాత్రనుండి జలమను మహాభూతము, దీనినుండి గంధతన్మాత్ర, ఈ గంధతన్మాత్రనుండి పృథివి యను మహాభూతము ఉదయించును. ఇందు ఆకాశమునకు శబ్దగుణమొక్కటియే యుండును. వాయువునకు శబ్దస్పర్శ

గుణములు రెండు, అగ్నికి శబ్దస్పర్శరూపములు మూడు, జలమునకు శబ్దస్పర్శ రూపరస గుణములు నాలుగు, పృథివికి శబ్దస్పర్శరూపరసగంధము లైదు గుణములు ఏకోత్తరవృద్ధిగా నుండును

పైనఁజెప్పిన భూతోత్పత్తి తామసాహంకారమునుండి కలుగును. ఇఁక రాజసాంశమైన తైజసాహంకారమునుండి శబ్దాదిగుణగ్రాహకములగు శ్రోత్ర త్వక్చక్షూరసనాఘ్రాణములను పంచజ్ఞానేంద్రియములు, వాక్పాణిపాదపాయూ పస్థలనెడి పంచకర్మేంద్రియములు, ఉభయాత్మకమనగా జ్ఞానేంద్రియమేగాక కర్మేంద్రియముగూడ నగు మనస్సు లేక అంతఃకరణము ఈ ఏకాదశకమనబడు పదునొకండు బుట్టును. ఇఁక ఇంద్రియములు స్వతః అచేతనములగుట చేత వాటి యధిష్ఠానదేవతలు అనగా వాటికి చైతన్యజనకులగు దిగ్వాతార్క వరుణాశ్వివహ్నీంద్ర విష్ణు మిత్రచంద్రులను దేవతలు అహంకారముయొక్క వైకారికాంశమునుండి జనింతురు. ఈ ప్రకారము ప్రకృతి, మహత్, అహం కారము, పంచతన్మాత్రలు, పంచమహాభూతములు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనస్సు పురుషుడు (లేక జీవుఁడు లేక క్షరపురు షుఁడు) అను సాంఖ్యశాస్త్రప్రతిపాదితములనే ఇరువదియైదు తత్త్వములనే యోగశాస్త్రముగూడ ప్రాతిపదికగా గ్రహించినది.

యోగశాస్త్రముయొక్క ముఖ్యమగు నుపదేశమేమన, క్షరపురుషుఁడగు జీవుఁడు ప్రకృతిబంధములనుండి విడుటకు మార్గము చిత్తవృత్తినిరోధము ద్వారా, అనగా మనస్సును తన వ్యాపారమునుండి మరలించి, దానిని లయింప జేయుటద్వారా సిద్ధించునని. 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అనుటచేత బంధకారణము మనస్సే గావున తల్లయమే కైవల్యప్రాప్తికి ద్వార మని తాత్పర్యము.

బహిర్ముఖ వ్యాపారముద్వారా (Extrovert activity) చాల విషయము లను సాధించెదమను పాశ్చాత్యసిద్ధాంతమయియుండగా, అంతర్ముఖత్వము చేతనే (Introvent trance) పురుషుడు స్వరూపావస్థానమును సాధించి కైవ ల్యము నొందగలడనునది ప్రాచీన సిద్ధాంతము. వేదాంతశాస్త్రముగూడ ఆత్మా నాత్మలు అనగా ఆత్మయు, ప్రపంచమనునవి తేజస్తిమిరములవలె పరస్పర విరుద్ధములని జెప్పినది. Matter is involved soul and soul is evolved

matter అను పరిణామ సిద్ధాంతమును భారతీయులంగీకరించరు. ఒకానొక ప్పుడు మందుచున్న భూగోళమునుండి మాట్లాడు మనుజుడుదయించెనను భావమును గ్రహించి Evolutionists నగా అపరిణామవాదులు matter is involved soul అని వ్రాకుచ్చిరి. కాని భారతీయసిద్ధాంతము 'తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్' అను నుపనిషద్వాక్యమువలన అచేతనమగు ప్రపంచమువేఱు, చైతన్యమువేఱు అని జెప్పుచు, చైతన్యము సర్వవ్యాపియు, ప్రపంచము (matter) కంటె భిన్నమనియు జెప్పినది. మనోలయముద్వారా దృశ్యము నశించనిదే దృగ్రూపుడైన పురుషునకు కైవల్యస్థితి జేకూరదని యోగశాస్త్ర సిద్ధాంతము.

కాళిదాసమహాకవి 'మరణం ప్రకృతి శ్శరీరిణాం, వికృతి ర్జీవితముచ్యతే బుధైః' అనగా' జీవితముకంటె పూర్వపరావస్థలే జీవికి యథార్థమగు ప్రకృతి యని, ఆ జీవికి జీవితమే వికారావస్థయని జెప్పినాడు. ఆ కాళిదాసే "అల్పస్య హేతోః బహుహాతుమిచ్ఛన్ విచారమూఢః పరిభాసి మే త్వమ్" అనగా అల్ప మైన విషయముకొఱకై గొప్పదైనదానిని విడుచుట మూఢలక్షణమనిఁ జెప్పుట చేత, సందర్భమువేఱైనను, దాని తాత్పర్యమేమనగా నశ్వరమైనదేహమే శాశ్వత మని భావించి, అమృతత్త్వమును గోల్పోవుట మూర్ఖుని దృక్పథము. 'దీప ముండగనే ఇల్లు జక్కబెట్టుకొనవలె' నను సామెతను పురస్కరించుకొని, జీవితమునకు సాధ్యాంశము అమృతత్త్వసిద్ధియే యని భారతీయమహర్షుల తాత్పర్యము.

పతఞ్జలిమహర్షి ప్రణీతమైన యోగసూత్రగ్రంథములో నాలుగు పాదములు గలవు. అవి (1) సమాధిపాదము, (2) సాధనపాదము, (3) విభూతిపాదము, (4) కైవల్యపాదము. ఈ నాలుగు పాదములందు క్రమముగా 51, 55, 55, 33 వెరశి 194 సూత్రములు గలవు.

ఈ చిన్నిపొత్తమందు ముఖ్యసూత్రములనే వ్యాఖ్యానించి, యోగశాస్త్ర సారాంశమునే ప్రతిపాదించెదము. ఈ సారాంశము నాధారముగజేసికొని చదు వరులు బృహత్తర గ్రంథములను పఠింప యత్నించిన ఈ గ్రంథకర్తయొక్క కృషి విఫలముగాదని విశ్వసించుచున్నాను.

ఇట్లు,

డా॥ ధూ. అర్కసోమయాజీ.

# సమాధి పాదము

* * *

సూత్రము 1. అథ యోగానుశాసనమ్.

తా॥ అథయను శబ్దము అధికారార్థము. అనగా శాస్త్రము నారంభించుచున్నామను హెచ్చరిక. యోగమనగా సమాధి. అనగా పలువిషయములందు సంచరించు మనమును అరికట్టుట. యుజిర్ ధాతువునకు 'యోగే', 'సమాధౌ' అను రెండర్థము లున్నను, 'సమాధౌ' అను నర్థమిచ్చుట గ్రహించదగినది. 'అనుశాసనమ్' అనుటచేత యోగశాస్త్రమనాదియనియు, దానిని పునః ఎత్తి చెప్పు చున్నామని అభిప్రాయము.

సూత్రము 2. యోగశ్చిత్తవృత్తి నిరోధః.

**యోగః = యోగమనగా, చిత్తవృత్తి నిరోధః = మనోవృత్తులను నిరోధించుట.**

**తా॥ అనగా మనస్సును తన వ్యాపారములనుండి మరలించుట.**

సూ॥ 3 తదా ద్రష్టుః స్వరూపే అవస్థానమ్.

**తదా = అట్లు మనస్సు నరికట్టిన, ద్రష్టుః = ద్రష్టయగు జీవునికి, స్వరూపే = తన నిజస్థితియందు, అవస్థానమ్ = ఉండుట కలుగును.**

తా॥ మనస్సును లయింప జేసిన జీవుడు సాక్షిభూతమైన కేవలచైతన్యరూపియైయుండును. అదియే ఆ జీవుని నైజస్థితి. ప్రపంచమంతయు దృశ్యమనఁబడును. ఈ దృశ్యము మనస్సు నాకర్షించి, పలుపలువిధముల పరుగెత్తు దానినిగా జేయును. అట్లు లోబడిన మనస్సు ప్రకృతిబంధములందు చిక్కువడి, జననమరణ

రూపమగు సంసారప్రవాహమున జీవుని గూలద్రోయును. ఆ ప్రకారము దృశ్యమునుండి దృక్‌ను మరలించిన, జీవుడు క్రమముగ కైవల్యస్థితి యనగా మోక్షము నొందజాలును

సూ॥ 4. వృత్తిసారూప్య మితరత్ర.

ఇతరత్ర = దృక్ రూపుడగు పురుషునికి స్వరూప స్థితి లభించక మనస్సు పలువిషయములందు విక్షిప్తమగుచో, వృత్తిసారూప్యమేర్పడును. అనగా మనస్సు తన వ్యాపారములందు స్వేచ్ఛగ కోతివలె సంచరించు చుండును. శబ్దమును వినుచున్న మనస్సు శబ్దము వెంబడి పరుగిడును. రూపమును జూచుచున్న మనస్సు రూపము వెంబడి పరుగిడును.

మనస్సునకు ముందు సూత్రమందు ఐదు వృత్తులు. అనగా ఐదు రకములగు వ్యాపారములు జెప్పఁబడును. ఆయా వ్యాపారములందు లగ్నమై మనస్సు తద్వ్యాపారసారూప్యమును పొందును. అనగా ఆయా వ్యాపారములందు మగ్నమై పోవును.

సూ॥ 5. వృత్తయః పంచతయ్యః క్లిష్టాః అక్లిష్టాః.

వృత్తయః = చిత్తవృత్తులు, పంచతయ్యః = ఐదు విధములు, మఱియు ఆ వృత్తులు క్లిష్టాః, అక్లిష్టాః క్లిష్టములనియు, అక్లిష్టములనియు ద్వివిధములు. కర్మవాసనకు క్షేత్రీభూతమై, పలువిధముల పరుగిడుచు దుఃఖమును కలుగఁజేయు వృత్తులు క్లిష్టములని జెప్పబడును. అట్లుగాక 'నేనువేఱు, ఈ ప్రపంచము నా మనస్సును విక్షిప్తముజేయునది' అని గుర్తించి జీవునకు వివేకఖ్యాతిని కలిగించు వృత్తులు అక్లిష్టములనఁబడును. పురుషః అనగా పురే = దేహమందు, శేతే = పరుండియున్న సాక్షిభూతమైన, దృగ్రూపమైన చైతన్యము.

తా॥ ఈ విశుద్ధ చైతన్యమును, మనస్సు, అగ్నిని పొగవలె గప్పివేసి, ప్రపంచ వస్తు భోగమందు వ్యాపారింపఁజేయును. అట్లు భోగలాలసమైన మనస్సు జీవుని జననమరణ రూపమైన సంసార చక్రమందు పరిభ్రమింప జేయును.

సూ॥ 6. ప్రమాణ విపర్యయ వికల్పనిద్రాస్మృతయః.

తా॥ ఆ ఐదు వృత్తులేవి యన: ప్రమాణము, విపర్యయము, వికల్పము, నిద్రా, స్మృతి యనునవి. అనగా చిత్తమీ యైదు అవస్థల యందు వ్యాపారించుచుండును.

సూ॥ 7. ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని.

ప్రమాణాని = ప్రమాణములను వృత్తులు ప్రత్యక్షమనియు, అనుమానమనియు, శబ్దప్రమాణము అనునవి.

తా॥ అక్షములనగా ఇంద్రియములు. ఈ పంచేంద్రియముల వల్ల బుట్టిన జ్ఞానము ప్రత్యక్షమనఁబడును. అనుమానమనగా హేతువాదముచేత గ్రహింపఁబడిన జ్ఞానము. 'పర్వతో వహ్నిమాన్, ధూమవత్త్వాత్' అనగా పర్వతమందు నిప్పు ఉండి యుండవలె; ఎందుచేతననగా పొగగలిగి యున్నది గాన అను హేతువాదము అనుమాన ప్రమాణమనఁబడును.

అగమ మనగా శబ్ద ప్రమాణము ఆప్తవాక్యముగాని, వేద వాక్యముగాని శబ్దప్రమాణము. విశ్వసింపఁదగినవాడు ఆప్తుఁడు. అతని వాక్యము విశ్వసనీయము. వేదవాఙ్మయము ఆప్తునికంటె ఎక్కువది గావున వేదవాక్యము ఆగమప్రమాణమనఁబడును.

ఈ పై మూడు ప్రమాణములచేత పుట్టిన జ్ఞానము మన బాహ్యదృష్టికి న్యాయ్యమైన జ్ఞానముగా గన్పట్టును. కాని యోగశాస్త్రము ఈ జ్ఞానము చిత్తవ్యాపారము వలన బుట్టినది గాన దీనినిగూడ అరికట్టవలయునని చెప్పుచున్నది. అనగా చిత్తమును సర్వవిధ దృశ్యములనుండి మరల్పవలయునని తాత్పర్యము.

సూ॥ 8. విపర్యయో మిథ్యాజ్ఞానమతద్రూపప్రతిష్ఠమ్.

విపర్యయః = విపర్యయమనగా, మిథ్యాజ్ఞానము = అబద్ధమైన జ్ఞానము; అతద్రూపప్రతిష్ఠమ్ = అనగా అతస్మిన్ తద్బుద్ధిః = అదిగాని యందు అదియను

భ్రాంతి, శుక్తియందు అనగా ముత్యపు చిప్పయందు, రజత భ్రాంతి = వెండియను భ్రాంతి. రజ్జుసర్పభ్రాంతి = అనగా త్రాటియందు పాము అను భ్రాంతి.

తా॥ ఈ భ్రాంతులు విపర్యయజ్ఞానము. ఈ విపర్యయజ్ఞానములందు మనస్సు వ్యాపారించుట ఎట్లుతగదో, ప్రత్యక్షానుమానములందు గూడ వ్యాపారించుట తగదనియే యోగశాస్త్ర సిద్ధాంతము

సూ॥ 9. శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్పః.

శబ్దజ్ఞానానుపాతీ = శబ్దజ్ఞానమువల్ల పుట్టి, వస్తుశూన్యః = ఆ జ్ఞానమునకు సంబంధించిన వస్తువు లేనిదైనచో వికల్పమనఁబడును

తా॥ గగనారవిందమ్ అను శబ్దమును విన్నప్పుడు ఆకాశమందు బుట్టిన పద్మమను జ్ఞానము కలుగును. కాని ఆకాశమందు పద్మము బుట్టదు గావున తద్వస్తు శూన్యత్వముచేత అది వికల్పమనబడును. 'పురుషస్య చైతన్యం స్వరూపమ్' అనగా పురుషుని స్వరూపము చైతన్యమని ప్రయోగించిన, పురుషుడే చైతన్యమై యుండ తత్స్వరూపము చైతన్యమనుట అప్రయోగము. దీనిని వికల్పమందురు. ఈ వికల్పజ్ఞానము, ప్రమాణజ్ఞానము కంటెను, విపర్యయజ్ఞానము కంటెను భిన్నమైనది. మనస్సు ఇట్టి జ్ఞానమందుగూడ వ్యాపారించుచుండును.

సూ॥ 10. అభావప్రత్యయాలంబనావృత్తిర్నిద్రా

అభావ ప్రత్యయ = శూన్యజ్ఞానము, ఆలంబనా = ఆలంబనముగాగల, వృత్తిః = చిత్తవృత్తి, నిద్రా = నిద్రయనబడును.

తా॥ నిద్రపోవునప్పుడేమియు తెలియదు. సర్వశూన్యమువలె భాసించును అట్టి శూన్యభాసయే నిద్రాస్వరూపము. 'ప్రాగస్వాప్సమ్, న కించిదవేదిషమ్' అనగా ముందు నిద్రబోతిని; ఏమియు తెలియనివాడనైతిని అను శబ్దప్రయోగమునకు శూన్యజ్ఞానమే ఆలంబ

నము చిత్తమా నిద్రయందుగూడ మగ్నమైయుండునుగాన, నిద్రను గూడ జయించవలెనని యోగశాస్త్ర తాత్పర్యము

సూ॥ 11. అనుభూతవిషయాసంప్రమోషః స్మృతిః.

అనుభూత = అనుభవింపఁబడిన, విషయ = విషయములయొక్క, అసంప్రమోషః = తుడిచివేయబడక పోవుట స్మృతియనబడును.

తా॥ అనగా జ్ఞాపకశక్తి మనస్సు అనుభూత విషయములను స్మరించుచుండు . ఈ రకమైన వ్యాపారమునుగూడ అరికట్టవలెను.

సూ॥ 12 అభ్యాసవైరాగ్యాభ్యాం తన్నిరోధః.

తన్నిరోధః — తత్ = ఆ చిత్తవృత్తులయొక్క, నిరోధః = అరికట్టుట, అభ్యాసవైరాగ్యాభ్యాం = అభ్యాసముచేతను, వైరాగ్యముచేతను సాధ్యమగును.

సూ॥ 13 తత్ర స్థితౌ యత్నోఽభ్యాసః.

తత్ర = ఆ యభ్యాసవైరాగ్యములలో, అభ్యాసః = అభ్యాసమనగా, స్థితౌ = మనసున్ను స్థిరముగా నుంచుటలో, యత్నః = ప్రయత్నమే.

తా॥ ఇచ్చట మనస్సును స్థిరముగా నుంచుట యనగా మనస్సునందు ఏ వృత్తులు లేకుండనుంచుట , అనగా మనస్సును ఏ వ్యాపారములో లేకుండ భావశూన్యముగా నుంచుట.

సూ॥ 14. స తు దీర్ఘకాలనైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః.

స తు = ఆ యభ్యాసమైతే, చిరకాలనైరంతర్య సత్కారా సేవితః = చిరకాలము నిరంతరము, తపస్సు బ్రహ్మచర్యము, విద్యాశ్రద్ధలతో సేవింపబడినదై, దృఢభూమిః = రూఢమగును.

తా॥ పైన జెప్పిన యభ్యాసమును చిరకాలము జేయవల యును; నిరంతరము జేయవలయును, అట్లు జేయుటలో తపో బ్రహ్మాచర్య విద్యాశ్రద్ధలు మనస్సుకు నైర్మల్యమును సంపాదించును.

సూ॥ 15. దృష్టానుశ్రవికవిషయవితృష్ణస్య వశీకారసంజ్ఞా వైరాగ్యమ్.

వైరాగ్యం = వైరాగ్యమనగా, దృష్టానుశ్రవికవిషయవితృష్ణస్య = దృష్ట = స్త్రీలు, అన్నపానములు, ఐశ్వర్యము ఇట్టి చూడబడే విషయములందును, అనుశ్రవిక = స్వర్గాది సంపాదనయందును, వితృష్ణస్య = ఆశలేనివానియొక్క, వశీకారసంజ్ఞా = మనస్సును వశముజేసుకొనుట యను పేరుగలది.

తా॥ మనస్సు ఐహికవిషయములగు అర్థకామములందు పరుగిడుచుండును. కొందరి మనస్సు, దానధర్మాదులను, యజ్ఞయాగా దులను జేయుచు స్వర్గసంపాదనయందాసక్తమగును. స్వర్గాదులనగా స్వర్గము, విదేహస్థితి అనగా దేవతాస్థితి, ప్రకృతిలయులను స్థితి దేవతాస్థితికంటె ఉత్కృష్టమైన మరియొకస్థితి. ఈ స్వర్గాదులు కూడ నశ్వరములే. 'క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి' అను భగవద్గీతా వాక్యానుసారము, ఏ పుణ్యమువలన స్వర్గము ప్రాప్తించినదో, ఆ పుణ్యము క్షీణించగానే తిరిగి మానవుడై పుట్టవలసివచ్చును. అందుచేత ఐహికభోగములవలె స్వర్గాదులు క్షణభంగురములు కాకపోయినను, అవికూడ నశ్వరములే గావున, ఐహికభోగములందు విరక్తివోలె స్వర్గాదులయందు గూడ విరక్తి కలిగిన వానిమనస్సు ఆ విరక్తుని వశములో నుండును. ఈ మనోవశీకారమే వైరాగ్యము అనగా వైరాగ్యమువలనే మనస్సు వశీకృతమగును.

సూ॥ 16. తత్పరం పురుషఖ్యాతేః గుణవైతృష్ణ్యమ్.

తత్ = ఆ వైరాగ్యము, పురుషఖ్యాతేః = ప్రకృతికంటె పురుషుడు అనగా ఆత్మ వేఱు అను దృఢవిశ్వాసమువలన, గుణవైతృష్ణ్యమ్ = వ్యక్తావ్యక్తము లైన సమస్తగుణములందు ఆశారహితుడై సంచరించుట, పరం = ఉత్కృష్ట మైన వైరాగ్యము.

తా॥ పైనఁజెప్పిన ఐహికాముష్మికభోగములందు విరక్తమైన మనస్సు, ఆ రకమైన వైరాగ్యమును పెంపొందించుకొని, ప్రకృతికి అతీతుడు పురుషుడు అను భావనచేత ఆత్మదర్శనముకోఱకై ప్రయత్నించుచు, సమస్తప్రాపంచికవిషయములందు నిరీహుడై సంచరించుచు, చివఱకు ఆత్మదర్శనమును పొందినచో అట్టి వైరాగ్యము పరాకాష్ఠను జెందినదన్నమాట.

సూ॥ 17. వితర్కవిచారానందాస్మితానుగమాత్ సంప్రజ్ఞాతః.

సంప్రజ్ఞాతః = సంప్రజ్ఞాత సమాధియనగా, వితర్క . అనుగమాత్ = వితర్కము, విచారము, ఆనందము, అస్మితా అను స్థితులతో గలియుటవలన నేర్పడు సమాధి.

తా॥ యోగశాస్త్రముయొక్క పరమ ఫలము సమాధిని సంపాదించుటయే ఈ సమాధి రెండు విధములు (1) సంప్రజ్ఞాత సమాధి, (2) అసంప్రజ్ఞాత సమాధి. ఇందు రెండవదియే పరమావధి. అట్టి అసంప్రజ్ఞాత సమాధిని పొందగలిగినవాడే స్వరూప ప్రతిష్ఠను బొంది సాక్షాత్కైవల్య స్థితిలో జీవన్ముక్తుఁడగును. ఆ స్థితికే మోక్షస్థితియని పేరు. ఈ యసంప్రజ్ఞాత సమాధికి బూర్వము యోగి సంప్రజ్ఞాత సమాధిని సంపాదించును. ఈ సమాధియందు వితర్కమని, విచారము అని, ఆనందమని, అస్మితయని నాల్గు భావములుండుటచేత సబీజ సమాధి యనఁబడును. వీటి లక్షణములు ముందు జెప్పబడును. అసంప్రజ్ఞాత సమాధికి సంప్రజ్ఞాత సమాధి క్రింది మెట్టని దెలియవలెను.

సూ॥ 18. విరామప్రత్యయాభ్యాసపూర్వః సంస్కారశేషః అన్యః.

అన్యః = ఆ రెండవదైన అసంప్రజ్ఞాత సమాధి, విరామ ప్రత్యయాభ్యాసపూర్వః = సమస్తచిత్తవృత్తుల విరమించుట అనగా నశించుట, తాత్పర్యముగా గలిగిన యభ్యాసము పూర్వమందుకలిగినట్టియు, సంస్కారశేషః = సంస్కారముల కంటె అతీతమైన స్థితి.

తా॥ అన్ని చిత్తవృత్తులు అనగా మనోవ్యాపారములు నశించి కేవలము ఆ చిత్తవృత్తుల సంస్కారములు స్థితి గూడ నశించిన అసంప్రజ్ఞాత సమాధి.

సూ॥ 19. ఈశ్వరప్రణిధానాద్వా.

ఈశ్వర = ఈశ్వరునియందు, ప్రణిధానాత్ = విశిష్టమైన భక్తివలన (absolute surrender to Godhead), వా = అయినను, సమాధి సిద్ధించుసని భావము.

తా॥ పరమేశ్వరునియందు తీవ్రభక్తి గలిగిన పురుషునకు ఈశ్వరానుగ్రహము కలిగి సత్వరముగ సమాధి సిద్ధించునని తాత్పర్యము. సాంఖ్యశాస్త్రము ఈశ్వరుని స్మరించదు కాని యోగ శాస్త్రము యోగసిద్ధికి ఈశ్వరానుగ్రహముగావలెనని చెప్పుచున్నది. ఇఁక ఆ యీశ్వరుడెవడు అన్న ప్రశ్నకు సమాధానము ముందు సూత్రము చెప్పును.

సూ॥ 20. క్లేశకర్మవిపాకాశయై రపరామృష్టః పురుషవిశేషః ఈశ్వరః.

ఈశ్వరః = ఈశ్వరుఁడనగా, క్లేశకర్మవిపాకాశయైః = ముందు చెప్పఁబోవు అవిద్యా, అస్మితా, రాగము, ద్వేషము, అభినివేశము అను పంచక్లేశముల చేతగాని, కర్మ = తత్క్లేశములచేత సంప్రాప్తించిన కర్మచేతగాని, విపాక = ఆ కర్మపరిపాకముచేతగాని, ఆశయైః = ఆ కర్మవాసనలచేతగాని, అపరామృష్టః = అంటబడని, పురుషవిశేషః = ఉత్తమపురుషుఁడు.

తా॥ భగవద్గీతయందు క్షరపురుషుఁడని, అక్షరపురుషుడని, ఈ ఇద్దఱికంటె మఱియొక పురుషోత్తముఁడున్నాఁడని చెప్పఁబడినది ఈ పురుషోత్తముఁడే యీశ్వరుడు లేక పరమాత్మ. ఈ పరమాత్మ నిర్గుణ, నిర్వికల్ప, నిరాఖ్యాతశుద్ధుఁడైన నారాయణుఁడే. ఈతని కర్మగాని, కర్మవాసనలుగాని ఏమియు నంటవు. ఇఁక క్షరపురుషులనగా

జీవాత్మలు. ఈ జీవాత్మ పరమాత్మలు గాక అక్షరపురుషుఁడు అనగా కూటస్థపురుషుఁ డనబడువాడు. ప్రకృతి పురుషుల క్షోభవలన (Interaction) సృష్టి జనించెనని చెప్పఁబడుటచేత, ఏ పురుషునికి ప్రకృతికిని మధ్య క్షోభ కలిగెనో ఆ పురుషుఁడే అక్షరపురుషుఁడు. వేదాంత శాస్త్రమందుగూడ నిర్గుణ పరబ్రహ్మ సృష్టి సమయమున సగుణ బ్రహ్మగా మారునని చెప్పఁబడినది. ఈ సగుణ బ్రహ్మయే అక్షరపురుషుడు.

సూ॥ 21. తత్ర నిరతిశయం సర్వజ్ఞబీజమ్.

తత్ర = పై సూత్రమందు నిర్వచింపఁబడిన ఈశ్వరునియందు, సర్వజ్ఞ బీజం = సర్వజ్ఞత్వమనెడిది, నిరతిశయం = హద్దులేనిది.

**తా॥** ఆ యీశ్వరుఁడే సర్వజ్ఞుడుగాని సర్వజ్ఞత్వమిక ఏ జీవునియందు సిద్ధించదు. ఈ యీశ్వరుఁడు దేశకాలాతీతుఁడు.

సూ॥ 22. తస్య వాచకః ప్రణవః

తస్య = ఆ యీశ్వరునికి, ప్రణవః = ఓంకారము, వాచకః = వాచకము.

తా॥ అనగా ఆ యీశ్వరుడు మనోవాగతీతుడగుటచేత, ఆతనిని నిర్వచించుటకు సాధ్యముగాక ఓంకారముచేతనే (Symbol for Godhead) ఆ యీశ్వరుని ఋషులు సూచించిరి.

సూ॥ 23. తజ్జపస్తదర్థభావనమ్.

తజ్జపః = తత్ = ఆ ఓంకారముయొక్క, జపః = జపమున్ను, తదర్థ భావనం = ఆ ఓంకారముయొక్క అర్థమైన ఈశ్వరుని, భావించుట వీనివలన సమాధి సిద్ధించునని తాత్పర్యము.

సూ॥ 24. తతః ప్రత్యక్చేతనాధిగమోఽప్యంతరాయాభావశ్చ.

తతః = ఆ ఓంకారజపముచేతను, తత్సూచితుడైన ఈశ్వరుని భావనము చేతను, ప్రత్యక్చేతనాధిగమః = స్వరూపదర్శనసిద్ధి అనగా ఆత్మదర్శనమున్ను,

అంతరాయాభావశ్చ = ముందుఁజెప్పబోవు సమాధ్యంతరాయములగు వ్యాధిస్త్యా నాదులు లేకపోవుటఁ గలుగును.

తా॥ నిరంతర-ఈశ్వర భావనచేత ఈశ్వరానుగ్రహము కలిగి, తదనుగ్రహము వలన, సమాధికి విఘ్నభూతములైన వ్యాధి మొదలుగునవి కలుగకుండ ఆత్మదర్శనము సిద్ధించును. ఇఁకముందు సూత్రమందు సమాధికి అంతరాయములు అనగా విఘ్నకారక విషయములు చెప్పబడుచున్నవి.

సూ॥ 25. వ్యాధిస్త్యాన సంశయ ప్రమాదాలస్య అవిరతి భ్రాంతి దర్శన **అలబ్ధభూమికత్వ అనవస్థితత్వాని చిత్తవిక్షేపాః తే అంతరాయాః.**

**చిత్తవిక్షేపాః** = చిత్తమునకు విక్షేపము అనగా నిలకడ లేకుండజేయు, తే=ఆ, అంతరాయాః = అంతరాయములేవి యవిన, వ్యాధి.... అనవస్థితత్వాని = వ్యాధి, స్త్యాన= ఏపనిజేయుట యందు అభిరుచి లేకపోవుట, సంశయము, అనగా నమ్మకము లేకటోవుట, ప్రమాదము = సమాధి కలుగకుండ తప్పుమార్గమందు బడుట, ఆలస్య = సోమరితనము, అవిరతి = విషయ భోగములందు ఆశ దీరకుండుట, భ్రాంతిదర్శన = విపర్యయ జ్ఞానము అనగా సరియైన జ్ఞానము లేకపోవుట, అలబ్ధభూమికత్వ = సమాధి స్థాయిని అందుకొనలేకపోవుట, అనవస్థితత్వాని = సమాధి భూమికలభించక పూర్వమే చిత్తము ఆ భూమిక నుండి జారిపోవుట.

తా॥ ఈ పైనఁజెప్పబడిన తొమ్మిది అంతరాయములు చిత్తమునకు సమాధి దొరకకుండ జేయునవి. ఈ అంతరాయములు తొలగుటకే ఈశ్వర ప్రణిధానమువల్ల ఈశ్వరానుగ్రహమును సంపాదించవలెను.

సూ॥ 26. దుఃఖదౌర్మనస్య అంగమేజయత్వ శ్వాసప్రశ్వాసాః విక్షేప **సహభువః.**

**విక్షేపసహభువః** = పైనఁజెప్పిన విక్షేపములతో కలిగెడివేవి యన, దుఃఖ...ప్రశ్వాసాః = దుఃఖము, దౌర్మనస్య = మనస్సు సరియైన స్థితియందు

లేకుండుట, అంగమేజయత్వ = శరీరావయవములను కంపింపజేయుట, శ్వాస = ఉచ్ఛ్వాసలు, ప్రశ్వాసాః = నిశ్వాసములు.

తా॥ దుఃఖము మూడు విధములు - ఆధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికము - ఆధ్యాత్మిక దుఃఖమనగా శరీరమందు వ్యాధివలనగాని, మనోవ్యాధివలనగాని జనించు దుఃఖము. ఆధిభౌతిక మనగా సర్ప వ్యాఘ్రాదులవల్ల జనించునది. ఆధిదైవికమనగా = గ్రహాది పీడ. ఈ మూడు పీడలులేని సంసారులుండరు. ఈ పీడలు దొలగవలెనన్న, ఈశ్వర ప్రణిధానము ద్వారా ఈశ్వరానుగ్రహము కలుగవలెను.

సూ॥ 27. తత్ప్రతిషేధార్థ మేకతత్త్వాభ్యాసః.

తత్ప్రతిషేధార్థం = తత్ = ఆ చిత్తవిక్షేపములయొక్క, ప్రతిషేధార్థం = తొలగించుటకొఱకై, ఏకతత్త్వాభ్యాసః = మనస్సును పలువిషయములందు పరుగిడకుండగ, ఏకాగ్రతను సంపాదించుట అవసరము.

తా॥ ఈ ఏకాగ్రత ముందుఁజెప్పిన అభ్యాసవైరాగ్యముల వల్లనే సిద్ధించును.

సూ॥ 28. మైత్రీ కరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖపుణ్యాపుణ్య విషయాణాం భావనాతశ్చిత్త ప్రసాదనమ్.

చిత్తప్రసాదనమ్ = చిత్తమును ప్రసన్నముగా జేయుట, సుఖ....విషయాణాం = సుఖము, దుఃఖము, పుణ్యము పాపము విషయముగాగల అనగా వాటి విషయమై, మైత్రీ····ఉపేక్షాణాం=మైత్రీయొక్క, దయయొక్క, సంతోషముయొక్క, ఉపేక్షాభావముయొక్క, భావనాతః = భావనవల్ల సిద్ధించును.

తా॥ చిత్తవృత్తులను అరికట్టుటకు ముందు చిత్తమును క్షోభలేకుండ ప్రసన్నమైనదానిగా జేసికొనవలెను. అందుకొఱకు, పుణ్యావశమువలన సుఖించుచున్న వారినిజూచి మైత్రీభావన జేయవలెను. వారు సుఖపడుచున్నారని మిత్రునివలె సంతోషించవలెను.

దుఃఖమును జెందువారిని జూచి జాలిపడవలెను. పుణ్యాత్ములను జూచి సంతోషించవలెను. పాపాత్ముల విషయమై ఉపేక్షాభావము వహించవలెను. ఈ ప్రకారమైన ప్రవృత్తిగల వాని చిత్తము ప్రసన్నమగును.

సూ॥ 29. ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య.

సమాధిలాభము కొఱకు మఱియొక మార్గము జెప్పఁబడుచున్నది.

ప్రాణస్య = ప్రాణవాయువుయొక్క, ప్రచ్ఛర్దన విధారణాభ్యాం ప్రచ్ఛర్దన = ప్రయత్నపూర్వక నిశ్వాసము చేతను, విధారణాభ్యాం = ప్రాణాయామము చేతను, సమాధి లాభమార్గమేర్పడును.

తా॥ ప్రాణాయామములో మూడు భాగములు. పూరకము. కుంభకము, రేచకము. పూరకమనగా = ప్రాణవాయువును పూరించుట, కుంభకమనగా = పూరించిన వాయువును కొంతకాలము స్తంభింప జేయుట, రేచకమనగా ప్రచ్ఛర్దనము = అనగా ప్రయత్నముతో దానిని బహిష్కరించుట. ఇట్టి ప్రాణాయామ నియతాభ్యాసము వలన గూడ చిత్తవృత్తులను అరికట్టవచ్చు.

సూ॥ 30. విషయవతీ వా ప్రవృత్తిరుత్పన్నా మనసః స్థితిబంధినీ.

ఉత్పన్నా = పుట్టిన, విషయవతీ = గంధాది విషయములుగల, ప్రవృత్తిః = సంవిత్ప్రవృత్తి, మనసః = మనస్సునకు, స్థితినిబంధినీ = స్థైర్యమును జేగూర్చునది.

తా॥ నాసికాగ్రమందు ధారణ జేయుట అభ్యాసించిన అనగా (Concentrate చేయుట) సదా నాసికాగ్రమందే దృష్టినిలుపుచు వచ్చిన, గంధసంవిత్ అనునది ఉదయించును అనగా ఒకానొక అతీంద్రియమైన సువాసనయొక్క అనుభూతి కలుగును దీనికి గంధవతీప్రవృత్తి యందురు. జిహ్వాగ్రమందు ధారణజేసిన ఒక దివ్యరసానుభూతి కలుగును. దీనికి రసవతీప్రవృత్తి యందురు. జిహ్వామధ్యమందు

ధారణఁ జేసిన అనగా జిహ్వామధ్యభాగమునందు చిత్తమును కేంద్రీకరించిన, ఒకానొక దివ్య స్పర్శానుభూతి కలుగును అట్లే జిహ్వామూలమందు చిత్తమును కేంద్రీకరించిన దివ్యశబ్దానుభూతి కలుగును. ఇట్టి అనుభూతులుదయించి మనస్సును క్రమముగా స్థిరీకరించును.

సూ॥ 31. విశోకా వా జ్యోతిష్మతీ.

విశోకా = శోకరహితమైన. జ్యోతిష్మతీ = జ్యోతిష్మతియను పేరుగల ఒకానొకసిద్ధి - దీనివలనగూడ మనస్సుకు స్థైర్యము కుదురును

తా॥ హృదయపుండరీకమందు ధారణఁ జేసిన అనగా మనస్సును కేంద్రీకరించిన, భాస్వరమగు ఆకాశమువలెనుండు బుద్ధి సత్త్వమందు అనగా బుద్ధియొక్క సాత్త్వికాంశమందు సూర్యచంద్ర గ్రహమణి ప్రభాకారముగ బుద్ధిసంవిత్ అను నొక దివ్యానుభూతి కలుగును.

సూ॥ 32. వీతరాగవిషయా వా చిత్తమ్.

వీతరాగవిషయం = రాగవిషయములు నశించిన, చిత్తం వా = చిత్తము అయినను స్థిరీకృతమగుననిభావము

తా॥ ఏవస్తువునందు అనురాగమును అనగా లంపటత్వమును తగ్గించుకొనిన, చిత్తము స్థిరీకృతమగును.

సూ॥ 33. స్వప్ననిద్రాజ్ఞానాలంబనం వా.

స్వప్నజ్ఞానము ఆలంబనముగాకలిగిన చిత్తమైనను, నిద్రాజ్ఞానాలంబనమైన చిత్తమైనను స్థితిపదమును పొందును అనగా స్థిరీకృతమగును.

తా॥ స్వప్నవిషయమందు మనస్సును ఏకాగ్రమైనదానిగానుంచుటచేతగాని, నిద్రాస్వరూపమందు ధారణ జేసినగాని మనస్సు స్థిరీకృతమగును.

సూ॥ 34. యథాభిమతధ్యానాద్వా.

తా॥ వేయేలా! ఇష్టమువచ్చిన ఒకానొక విషయమందు మనస్సు ఏకాగ్రమైనదానినిగా జేసినను మనస్సు స్థిరీకృతమగును. స్థిరీకృతమైన మనస్సునందు క్రమముగా మనో వ్యాపారములుడిగి సమాహితచిత్తుడగును, అనగా సమాధిని బడయును.

సూ॥ 35. పరమాణు పరమ మహత్త్వాంతో అస్య వశీకారః

అస్య = అట్టివానికి అనగా మనస్సును స్థిరీకృతమైనదానిగా జేసినవానికి, వశీకారః = వశీకరణము, పరమాణు పరమమహత్త్వాంతః = పరమాణువు మొదలు పరమమహత్పదార్థము వఱకు సిద్ధించును

తా॥ అనగా పరమాణు పర్యంతము సూక్ష్మ వస్తువునందు ధారణఁజేసిన పరమాణు పర్యంతము మనస్సు స్థిరీకృతమగును. పరమ మహత్పదార్థమందు ధారణజేసిన, మనస్సు తత్పర్యంతము స్థితిని సంపాదించును.

సూ॥ 36. క్షీణవృత్తేరభిజాతస్యేవ మణేః గ్రహీతృగ్రహణగ్రాహ్యేషు తత్స్థతదంజనతా సమాపత్తిః ॥

అభిజాతస్యేవ మణేః = అత్యుత్తమమైన మణికివోలె, క్షీణవృత్తేః = చిత్త వృత్తులను క్షీణింపఁజేసినవానికి, గ్రహీతృ గ్రహణ గ్రాహ్యేషు = గ్రహీతృ = గ్రహీత యగుపురుషునియందు గ్రహణ = గ్రహించునింద్రియముల యందు, గ్రాహ్యేషు = గ్రహింపఁబడు వస్తువులయందు ధారణజేయుట వలన, తత్స్థతదంజనతాసమాపత్తిః = ఆయావాటియందుండి, తదాకారాకారితత్వము సిద్ధించును

తా॥ స్ఫటికమందు ప్రతిఫలించిన వస్తువుయొక్క ఆకారమును ఆ స్ఫటికమెట్లు పొందునో అట్లే, చిత్తవృత్తులు నశించినవానికి, పురుషునియందు అనగా ఆత్మయందు ధారణఁజేసిన, ఆత్మయందుండి ఆత్మయొక్క ఆకారమును పొందుట సిద్ధించును గ్రహణములగు

నింద్రియములందు ధారణఁ జేసిన, ఇంద్రియములందు చిత్తము స్థిరీకృతమై తదింద్రియాకారమును బొందును. గ్రాహ్య వస్తువులందు ధారణఁ జేసిన, ఆ యా వస్తుస్థితిని బొంది మనస్సు తదాకారాకారిత మగును. ఒక ముక్తపురుషునియందు ధారణ, జేసిన ఆ ముక్త పురుషాకారముఁ బడయును.

ఇక ముందు జెప్పిన, వితర్కవిచారానందాస్మితానురూపానుగతములైన నాలుగు విధముల సంప్రజ్ఞాత సమాధిని నిర్వచించుచున్నారు

సూ॥ 37. తత్ర శబ్దార్థజ్ఞానవికల్పైః సంకీర్ణా సవితర్కా సమాపత్తిః.

తత్ర = ఆ సంప్రజ్ఞాత సమాధి విషయములో, శబ్దార్థజ్ఞానవికల్పైః = శబ్దము, అర్థము, జ్ఞానము ఈ మూడు విషయములతో, సంకీర్ణా = సంకీర్ణమైన, సమాపత్తిః = సంప్రజ్ఞాతసమాధి, సవితర్కా = వితర్క సహితమైన సమాధి యగును.

తా॥ గౌః అను శబ్దమును, ఆవు అనుదాని యర్థము గౌః అను శబ్దముచ్చరింపఁబడగానే ఆవు యను జ్ఞానము, ఈ మూడు ఏక కాలమందు సంకీర్ణములై దోచినచో సవితర్క సంప్రజ్ఞాత సమాధి యనబడును అనగా చిత్తవృత్తులను నిరోధించి సంప్రజ్ఞాతసమాధిని సంపాదించుకొన్న యోగికి శబ్దము, తదర్థము, తత్ జ్ఞానము ఈ మూటి వితర్కము కలుగుచుండిన, ఆ సమాధి సవితర్క సమాధి.

సూ॥ 38. స్మృతి పరిశుద్ధే స్వరూపశూన్యేవ అర్థమాత్రనిర్భాసా నిర్వితర్కా.

స్మృతి పరిశుద్ధే = శబ్దము, అర్థము, జ్ఞానము ఈ మూటియొక్క స్మృతి లేకుండా, అర్థమాత్రనిర్భాసా = ఆవుయను వస్తువునందే లగ్నమైన మనస్సునకు, స్వరూపశూన్యేవ = వ్యాపారించుచున్న తాను మనస్సను జ్ఞానములేనట్లుగా నున్న, నిర్వితర్కా సమాపత్తిః = నిర్వితర్క సంప్రజ్ఞాత సమాధి.

తా॥ సంప్రజ్ఞాతసమాధిలో గౌః అను శబ్ద మొకమూల గోచ రించుచు, ఆవు యను వస్తువు ఒకమూలగన్పట్టుచు, గోవును జూచు చున్నా నను జ్ఞానము దోచుచుండిన యెడల సవితర్కసమాధి యని అట్లుగాక శబ్దము జ్ఞానము గూడ లయించి, శబ్దార్థముమాత్రమే మనోలగ్నమైన నిర్వితర్క సంప్రజ్ఞాతసమాధి యనబడును.

సూ॥ 39. ఏతయైవ సవిచారా నిర్విచారా సూక్ష్మవిషయా వ్యాఖ్యాతా.

ఏతయైవ=ఈపైనఁజెప్పిన దానిచేతనే, సూక్ష్మవిషయా=సూక్ష్మములైన విషయములుగల, సవిచారా=సవిచార సమాపత్తియు, నిర్విచారా=నిర్విచార సమాపత్తియు, వ్యాఖ్యాతా=చెప్పబడినట్లే,

విషయము స్థూలమైనదైనచో సవితర్కనిర్వితర్క సమాపత్తు లందురు. విషయము సూక్ష్మమైనదైనచో, సవిచార నిర్విచార సమాపత్తు లందురు.

సూ॥ 40. సూక్ష్మవిషయత్వం చ అలిఙ్గపర్యవసానమ్.

విషయము సూక్ష్మమైనదన్న సందర్భములో ఆసూక్ష్మత్వమెంత వఱకు నను ప్రశ్నకలుగును. పంచభూతములకు కారణభూతములు, తద్భూతతన్మాత్రలు, ఆతన్మాత్రలకు కారణభూతమహంకారము– అహంకారమునకు మహత్తు, మహత్తునకు ప్రధానము లేక ప్రకృతి- ఇవన్నియు ఒకదానికంటె తత్కారణము సూక్ష్మమైనది. అన్నిటి కంటె ప్రధానము అనగా ప్రకృతి మహా సూక్ష్మమైనది. ఇచ్చట లిఙ్గమనగా ప్రకృతి. ఈప్రకృతిపర్యంతము సూక్ష్మత కొనసాగును.

సూ॥ 41. తా ఏవ సబీజః సమాధిః.

సబీజః సమాధిః=సంప్రజ్ఞాత సమాధి లేక సబీజ సమాధి యనగా, తా ఏవ=ఆసవితర్క నిర్వితర్క సవిచార నిర్విచార సమాపత్తులే,

తా॥ ఇచ్చట ఈ సంప్రజ్ఞాతసమాధిలో బహిర్వస్తు బీజమున్నది గావున, సబీజ సమాధియనబడును. అట్టివస్తువేదియులేక నిర్వస్తుకమైన నిర్బీజసమాధి లేక అసంప్రజ్ఞాతసమాధి యనబడును

సూ॥ 42. నిర్విచారవైశారద్యే అధ్యాత్మప్రసాదః.

విశారదమైన నిర్విచారసమాపత్తి సిద్ధించిన అధ్యాత్మప్రసాదము సిద్ధించె ననఁబడును.

తా॥ వైశారద్యమనగా రజస్తమోగుణావరణములేక కేవలము బుద్ధిసత్వము, అనగా ప్రకాశస్వరూపమైన సాత్త్వికబుద్ధి ప్రవహించుచుండుట. నిర్విచారసమాధికి ఇట్టి వైశారద్యము సిద్ధించిన యోగికి అధ్యాత్మప్రసాదము కలుగును. "ఈ అధ్యాత్మప్రసాదము కలిగిన యోగిని వర్ణించు "శ్లోకము "ప్రజ్ఞాప్రసాదమారుహ్యా అశోచ్యః శోచతో జనాన్ భూమిష్ఠా నివ శైలస్థః సర్వాన్ ప్రాజ్ఞోఽనుపశ్యతి" అనగా పర్వతమందున్న వాడు, క్రిందనున్న వారిని జూచురీతి, అధ్యాత్మ ప్రసాదమను ప్రజ్ఞాలోకముగల యోగి, శోకమునకు దూరుడై శోచించు వారినిజూచు చుండును.

సూ॥ 43. ఋతమ్భరా తత్ర ప్రజ్ఞా.

తత్ర = ఆ విషయములో, ప్రజ్ఞా = పైనజెప్పబడిన అధ్యాత్మప్రసాదము సిద్ధించిన ప్రాజ్ఞునియొక్క, ప్రజ్ఞ, ఋతమ్భరా = ఋతమ్భర యన బడును. ఈ ప్రజ్ఞ ఎట్లు సిద్ధించునో జెప్పు మఱియొక శ్లోకము;

ఆగమేనాఽనుమానేన ధ్యానాభ్యాసరసేన చ।
త్రిధాప్రకల్పయన్ ప్రజ్ఞాం లభతే యోగముత్తమమ్॥

తా॥ ఆగమము అనగా శ్రుతమైనశాస్త్రముచేత, అనుమానమనగా శ్రుతమైనదానిని తర్కించుటచేతను, ధ్యానమును నిరతము అభ్యసించుటచేతను, పైన జెప్పిన ఋతమ్భరా యను ప్రజ్ఞను ముప్విధముల సాధించిన ఉత్తమ యోగమును యోగి పొందగలడు.

సూ॥ 44. శ్రుతానుమానప్రజ్ఞాభ్యా మన్యవిషయా విశేషార్థత్వాత్

పైనఁజెప్పఁబడిన ఋతంభరా యను ప్రజ్ఞ, శ్రుతానుమానప్రజ్ఞాభ్యాం = శ్రుతప్రజ్ఞకంటె, అనుమానప్రజ్ఞకంటె, అన్యవిషయా = ఇతరమైన విషయము గలది విశేషార్థత్వాత్ = విశిష్టమైన విషయము గలదగుటచేత

తా॥ ఋతమ్భరాప్రజ్ఞ సిద్ధించిన పాండిత్యముగాని, తర్క కౌశలముగాని సాధించలేని సిద్ధికలుగును.

సూ॥ 45 తజ్జః సంస్కారః అన్యసంస్కారప్రతిబంధీ.

తజ్జః = ఆ ఋతమ్భరప్రజ్ఞవలన గలిగిన, సంస్కారః = సంస్కారము, అన్యసంస్కారప్రతిబంధీ = ఇతర సంస్కారములను కలుగనీయదు. తదేక సంస్కారమే కలుగును.

సూ॥ 46. తస్యాఽపి నిరోధే సర్వనిరోధాత్ నిర్బీజః సమాధిః

తస్యాఽపి = ఆ ఋతమ్భరప్రజ్ఞ వలన గలిగిన సంస్కారముయొక్క, నిరోధే = నిరోధము సిద్ధించినచో, సర్వనిరోధాత్ = సమస్తమైన చిత్తవృత్తుల యొక్క నిరోధము సిద్ధించుటచేత, నిర్బీజః సమాధిః అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించును.

సమాధిపాదము సమాప్తము.

# సాధనపాదము

* * *

ప్రథమ పాదమందు సమాధి స్వరూపము నిర్వచింపఁబడినది ఇఁక ద్వితీయ పాదమందు తత్సాధన విధానము వర్ణింపబడును.

సూ॥ 47. తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని క్రియాయోగః

క్రియాయోగః = క్రియారూపమైన యోగము అనగా యోగసాధనక్రియ, తపః ,  ప్రణిధానాని = తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము

తా॥ తపస్వికానివానికి యోగము సిద్ధించదు ఈశ్వర ప్రణిధానము యోగసిద్ధికి అయుధము - సమస్తక్రియలను పరమేశ్వరార్పణముగా గావించుట ఈశ్వర ప్రణిధాన లక్షణము - స్వాధ్యాయము అనగా తన శాఖకు సంబంధించిన వేదాధ్యయనము గూడ తపోరూపమే.

సూ॥ 48. సమాధిభావనార్థః క్లేశతనూకరణార్థశ్చ.

పైన జెప్పబడిన క్రియాయోగ మెందుకనగా, సమాధిభావనార్థః = సమాధి సిద్ధించుటకొఱకున్నూ, క్లేశతనూకరణార్థశ్చ = ముందుజెప్పబోవు క్లేశములను క్షీణింపజేయుటకున్నూ ఉపకరించును.

సూ॥ 49. అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః క్లేశాః.

క్లేశములనగా, అవిద్యా ... అవిద్యయు, అస్మితయు, రాగము, ద్వేషము, అభినివేశము — ఈ యైదు క్లేశముల లక్షణముల ముందు జెప్పఁబడును.

సూ॥ 50. అవిద్యా క్షేత్రముత్తరేషాం ప్రసుప్తతనువిచ్ఛిన్నోదారాణామ్.

ప్రసుప్తతనువిచ్ఛిన్నోదారాణాం = ప్రసుప్తావస్థయందు, సూక్ష్మావస్థయందు, విచ్ఛేదావస్థయందు, విషయములందు ప్రవర్తించు నవస్థయందు

ఉన్నట్టి. ఇతరేషాం = అస్మితారాగద్వేషాభినివేశములను క్లేశములకు, అవిద్యా = అవిద్యయే, క్షేత్రం = మూలకారణము.

తా॥ పైన జెప్పబడిన క్లేశములు, కొన్ని సుప్తావస్థయందు (నిద్రించుచున్న వివలె గన్పట్టకుండు నవస్థ) కొన్ని సూక్ష్మావస్థయందు, కొన్ని మధ్య మధ్య విచ్ఛేదము నొందుచు తిరిగి కన్పట్టు నవస్థయందు, కొన్ని విషయ ప్రవృత్తి కలిగియున్న యవస్థయందు ఉండును - వీటి కన్నిటికి అవిద్యయే మూలకారణము.

సూ॥ 51. అనిత్యాశుచి దుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతి రవిద్యా. అవిద్యా = అవిద్య యనగా:

అనిత్యవస్తువునందు నిత్యత్వభావన కలుగజేయునది, అశుచియైన పదార్థమందు శుచిత్వభావన కలుగజేయునది, దుఃఖమందు సుఖమను భావన కలుగజేయునది, అనాత్మయందు ఆత్మ భావన కలుగజేయునది. ఉదాహరణము - శరీరము అనిత్యము, అశుచి, దుఃఖమునకు మూలము, ఆత్మకంటె భిన్నమైనది. ఐనప్పటికి అది నిత్యమని, శుచియని, సుఖకరమని, ఆత్మయే యని లోకము భ్రాంతించును. ఈ భ్రాంతికి కారణ మవిద్యయే

సూ॥ 52. దృగ్దర్శనశక్త్యోః ఏకాత్మతే వాఽస్మితా.

అస్మితా = అస్మితయను క్లేశమేది యనగా, దృక్దర్శనశక్త్యోః = దృక్ యనగా పురుషుడు లేక ఆత్మ, దర్శనమనగా బుద్ధి, ఈ రెంటి శక్తులు ఒకటియే యను భ్రాంతి.

తా॥ అనగా బుద్ధిని ఆత్మయందధ్యాసించి, రెండు నొకటియే యని భావించుట అస్మితా.

సూ ॥ 53. సుఖానుశయీ రాగః.

రాగః = రాగమనగా, సుఖానుశయీ = సుఖమునుపొంది తిరిగి తత్సుఖముకొఱకు తిరిగి పుట్టు కోరిక.

సూ ॥ 54. దుఃఖానుశయీ ద్వేషః.

ద్వేషః = ద్వేషమనగా, దుఃఖానుశయీ = దుఃఖమునుపొంది, వెంటనే ఆ దుఃఖహేతువును ద్వేషించుట.

సూ ॥ 55. స్వరసవాహీ విదుషోఽపి తథాఽఽరూఢో అభినివేశః.

విదుషోఽపి = పండితునికిగూడ, స్వరసవాహీ = తనంతట తానే ప్రవహించుచు, తథా = ఆ ప్రకారము, ఆరూఢః = పాతుకొనిపోయినది, అభినివేశః = మరణభీతి.

సూ ॥ 56. క్లేశమూలః కర్మాశయో దృష్టాదృష్టజన్మవేదనీయః.

క్లేశమూలః = పైన జెప్పినఅవిద్యాది పంచక్లేశములు మూలముగాగ, కర్మాశయః = పుణ్యపాపరూపమైన కర్మలవలన గలిగిన వాసనాసమూహము, దృష్టాదృష్టజన్మవేదనీయః = ఇప్పుడు చూడబడే ఇహజన్మచేతను, ఇప్పుడు చూడఁబడని భావిజన్మలచేతను తెలియఁదగినవి.

తా॥ కాళిదాసు "ఫలానుమేయాః ప్రారంభాః సంస్కారాః ప్రాక్తనా ఇవ" అని చెప్పినటు, జన్మాంతరీయ సుకృతదుష్కృత కర్మలు వాసనారూపమున నుండి, వాటి ఫలకాలమందే తెలియబడును. కొన్ని కర్మలయొక్క ఫలిత మీ జన్మయందు తెలియబడును; కొన్నిటి ఫలము ఉత్తర జన్మలయందు వాటి పరిపాకకాలమందు తెలియఁబడును. 'అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవఫలమశ్నుతే' అను వృద్ధకారికాను సారము మహాపుణ్యములు జేసినను, మహాపాపములను జేసినను ఈ జన్మయందే అనుభవించెదరట. సామాన్యమైన పుణ్యపాపముల ఫలము జన్మాంతరమందు గూడ అనుభవింపఁబడునట. కావున దృష్టజన్మవేదనీయము లనగా ఈ జన్మయందే తెలియదగిన ఫలముగలిగిన కర్మలు

CENTRAL LIBRARY

అదృష్టజన్మ వేదనీయము అనగా భావిజన్మలయందు అనుభవము లోనికి వచ్చు కర్మలని తాత్పర్యము.

సూ॥ 57. సతి మూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః

మూలే సతి=కర్మాశయమునకు మూలము లైన అవిద్యాది క్లేశములుండిన, తద్విపాకః = ఆకర్మలయొక్క పరిపాక మేమనగా, జాత్యాయుర్భోగాః....జాతి= ఒకానొక యోనియందు పుట్టుక, ఆయుః = ఆ పుట్టుకలో ఆయుర్దాయము భోగాః = ఆ జన్మయందు భోగములు ఫలితముగా నుండును.

తా॥ అవిద్యాది క్లేశములు కర్మల జేయించును. ఆ కర్మలకు పరిపాకావస్థయందు ఫలమును అనుభవించి తీరవలెను. 'నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి' అనగా జేసిన కర్మయొక్క ఫలమును అనుభవించకుండా ఆ కర్మపోదు. అనగా చేసిన కర్మయొక్క ఫలితమును అవశ్యమనుభవించి తీరవలెను. ఆకర్మానుసారము ఈ జన్మయందు మానవుడై పుట్టినను ఉత్తరజన్మయందు కుక్కగానో, పందిగానో బుట్టవచ్చునని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి.

రమణీయ చరణాః రమణీయాం యోని మాపద్యన్తే।
కపూయ చరణాః కపూయాం యోని మాపద్యన్తే॥

అనగా మంచికర్మ జేయువారు మంచి జన్మ ఎత్తెదరు. పాప కర్మ జేయువారు పాపయోనులందు బుట్టెదరు. ఈ భావమే కఠోపనిషత్తులోగూడ( జెప్పబడినది.

యోని మన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః।
స్థాణుమన్యేఽనుసంయంతి యథాకర్మ యథాశ్రుతమ్॥

కొందఱు మహాపాపము( జేసి వృక్షములుగా కూడ( బుట్టెదరట. కావున అవిద్యాదిక్లేశమూలమున్నంతకాలము కర్మ జేయక మానరు. ఆ కర్మానుసారము జాతి అనగా జన్మ, ఆయుః = ఆ జన్మయందా

యుర్దాయము, భోగాః = ఆ జన్మయందు కలిగెడి భోగములు సిద్ధించు చుండునని తాత్పర్యము.

సూ॥ 58. తే హ్లాదపరితాపఫలాః పుణ్యాపుణ్యహేతుత్వాత్.

తే = ఆ జాత్యాయుర్భోగములు, పుణ్యాపుణ్యహేతుత్వాత్ = పుణ్యపాప ములు కారణముగాగల వగుటచేత, హ్లాదపరితాపఫలాః = హ్లాద-సంతోషము, పరి తాప - సంతాపము, ఫలాః - ఫలముగాగలవి-

తా॥ అనగా పుణ్యకర్మలు సుఖమును, పాపకర్మలు దుఃఖ మును కలుగజేయును.

సూ॥ 59. పరిణామతాపసంస్కారదుఃఖైః గుణవృత్తివిరోధాచ్చ దుఃఖమేవ సర్వం వివేకినః.

పరిణామ ...దుఃఖైః = పరిణామదుఃఖము, తాపదుఃఖము, సంస్కారదుఃఖ ములచేతను, గుణవృత్తివిరోధాచ్చ = సత్త్వరజస్తమోగుణములయొక్క, తత్కార్యములగు చిత్తవృత్తులయొక్క పరస్పర విరోధమువలనను, వివేకినః = వివేకముగలవాని, సర్వం = సుఖదుఃఖములన్నియు, దుఃఖమేవ = దుఃఖమే.

తా॥ పుణ్యకర్మవలన సుఖమును పొందినను, తత్సుఖాంత మున సుఖాభావముచేత దుఃఖము ప్రాప్తించును. ఇది పరిణామ దుఃఖము. తాపదుఃఖమనగా పాపకర్మయొక్క ఫలానుభూతి కాల ములో సంతాపమే దుఃఖము. ఇక సంస్కార దుఃఖమనగా, పుణ్య పాపములయొక్క సంస్కారములు అనగా వాసనలు లోపలనుండి తిరిగి కర్మల జేయించుచుండును. ఆ కర్మలు తిరిగి సుఖదుఃఖముల నిచ్చు చుండును. ఈ ప్రకారమనంతముగా కొనసాగుచుండును. మఱియు సత్త్వరజస్తమోగుణములు, ఆ గుణముల వలన కలిగిన చిత్తవృత్తులు పరస్పర విరోధము కలవగుటచేత, విరుద్ధకర్మలకు మూలమై పుణ్య పాపముల జేయించుచుండును. ఇట్లు సంసారమందు తాత్కాలిక ముగా కొంత సుఖముగా కన్పట్టినను, చివఱకు సర్వము దుఃఖమే యని

వివేకవంతునకు దోపకమౌనదు. వేయేల! ప్రతి మానవుఁడు వయః కాల మందు కొంత సుఖమనుభవించినప్పటికి, ఆతని జీవిత మంతమందు జరామరణగ్రస్తమే కదా! కావున ఎన్ని భోగములనుభవించినను చివఱకు జీవితము దుఃఖాంతమేగదా! పరిణామమందు అనగా చివఱకు జీవితము దుఃఖమేగదా! అజ్ఞానుఁడు తాత్కాలిక సుఖములందు జిక్కుకొనును. వివేకి ఆ తాత్కాలిక సుఖములను గూడ దుఃఖము గానే భావించును.

సూ॥ 60. హేయం దుఃఖ మనాగతమ్.

అనాగతం = ముందురాబోయే, దుఃఖం = దుఃఖమే, హేయమ్ = విడిచి పెట్ట దగ్గది.

తా॥ గతించిన దుఃఖమునుగూర్చి వగచిన లాభము లేదు. వర్తమానకాలమందున్న దుఃఖమనుభవించక తప్పదు. ఇఁక ఏ దుఃఖ మును మనము రాకుండా జేయగలమనగా అనాగత దుఃఖము అనగా ముందు కలుగబోయే దుఃఖమును రాకుండ జేయు నుపాయమును వెదుకవలెను. అదెట్లనిన,

సూ॥ 61. ద్రష్టృదృశ్యయోః సంయోగో హేయహేతుః.

దృక్దృశ్యయోః = దృక్కు అయిన పురుషునికి దృశ్యమైన ప్రపంచము యొక్క, సంయోగః = సంయోగమే, హేయహేతుః = ముందురాకుండా జేసు కొనవలసిన దుఃఖమునకు కారణము.

తా॥ ఈ సూత్రము యోగశాస్త్రముయొక్క ముఖ్యమైన తాత్పర్యమును బోధించునది. మనస్సును ఆకర్షించి పుణ్యాపాపకర్మ లలో దింపునది దృశ్యమే అనగా ప్రపంచమే. ఆ ప్రపంచమందు మన స్సునకు లంపటత్వమే అనగా సంయోగమే రాబోయే దుఃఖమునకు కారణము. కావున రాబోవు దుఃఖము రాకుండ జేసికొనవలెనన్న

చిత్తమునకు ప్రపంచముతో సంయోగము కూడదు. ఆ సంయోగము లేనిచో చిత్తవృత్తులు నశించి యోగమార్గమున చిత్తము ప్రవేశించును.

పైన హేయహేతుః అన్న పదమును హేయశ్చాసౌ హేతుశ్చ లేక హేయస్య దుఃఖస్య హేతుః అని రెండువిధములుగా అన్వయించవచ్చును. రెండవ అర్థము పైన వ్రాయఁబడినది. మొదటి అర్థమేమన సంయోగః హేయః, సంయోగః హేతుః అని అనగా దృగ్దృశ్యముల యొక్క సంయోగము విడువదగినది ఎందుచేతననగా రాబోయే దుఃఖమునకు అది హేతువు గాన —

సూ॥ 62. ప్రకాశక్రియాస్థితిశీలం భూతేంద్రియాత్మ భోగాపవర్గార్థం దృశ్యమ్.

దృశ్యం = దృశ్యము అనగా ప్రకృతి, ప్రకాశ . శీలం—ప్రకాశ = సత్త్వ గుణ, ధర్మము, క్రియా = రజోగుణ ధర్మము, స్థితిశీలం = తమోగుణధర్మము గలదై, భూతేంద్రియాత్మకం = పంచభూతములు, ఇంద్రియములు కలదియై, భోగాపవర్గార్థం = దృక్ రూపుడైన పురుషునికి, భోగాపవర్గార్థం = భోగము కొఱకున్నూ మోక్షముకొఱకున్నూ ఉద్దేశింపఁబడినది.

తా॥ ప్రకృతి సత్త్వరజస్తమోగుణాత్మకము — పంచభూతములు ఇంద్రియములు, ఈ ప్రకృతిలో భాగములు — ఈ దృశ్యమందు లంపటుడైనవాడు భోగి యనబడును. ఈ దృశ్యము హేయమని తత్సంయోగము బొందనివాడు మోక్షము నొందును. దృశ్యమున్నది గావుననే, దానిని దూరీకరించుటలోనే మోక్షమున్నది గావున, దృశ్యమే మోక్షమునకు కూడ ఉపకరించునని చెప్పబడినది.

సూ॥ 63. ద్రష్టా దృశిమాత్రః శుద్ధోఽపి ప్రత్యయానుపశ్యః.

ద్రష్టా = పురుషుడు, దృశిమాత్రః = చైతన్యమాత్రుడై, శుద్ధోఽపిసన్ = దృశ్యమును అంటనివాడైనను, ప్రత్యయానుపశ్యః = బుద్ధికి గోచరించే జ్ఞానమును తాను గ్రహించుచున్నవానివలె కన్పట్టును.

తా॥ అనగా చైతన్యము అతఃకరణమందు ప్రతిఫలించుటచేత అంతఃకరణముచూచే దృశ్యము చైతన్యరూపుడైన పురుషుడు చూచుచున్నట్లు గన్పట్టును.

సూ॥ 64. తదర్థ ఏవ దృశ్యస్యాఽఽత్మా.

దృశ్యస్య = ప్రకృతియొక్క, ఆత్మా = ఆత్మ, తదర్థ ఏవ = పురుషునికొఱకే ప్రవర్తించుచున్నది.

తా॥ అనగా దృశ్యము, దృక్ అయిన పురుషునికొఱకే ఉద్దేశింపబడినది.

సూ॥ 65 కృతార్థం ప్రతి నష్టమపి అనష్టం తదన్యసాధారణత్వాత్.

తత్ = ఆదృశ్యము, కృతార్థంప్రతి = కైవల్యము పొందినవానిని గూర్చి. నష్టమపి = నశించినదైనను, అన్య సాధారణత్వాత్ = ఆ మోక్షము పొందినవానికంటె అన్యులకు, సాధారణమైనది గావున అనగా ఏకరూపముగా గోచరించును గావున, అనష్టమేవ = నశించనిదే

తా॥ ఒకానొక యోగి కైవల్యము పొందినప్పుడు ఆ దృశ్యమతనికి నశించిపోయెనన్నమాట. ఇఁక కైవల్యము పొందని వారికి, అది కన్పట్టుచునే యుండును అనగా అట్టి వారికి నశించనిదే.

ఈ సూత్రములో జీవాత్మలు అనేకములని తాత్పర్యమును యోగశాస్త్రము ప్రతిపాదించినది. అద్వైతమందు పరమాత్మ ఒక్కటియే యని, జీవాత్మలు తదాభాసలని, అనగా తత్ప్రతిబింబములని చెప్పబడినది.

సూ॥ 66. స్వస్వామిశక్త్యోః స్వరూపోపలబ్ధిహేతుః సంయోగః.

స్వస్వామిశక్త్యోః = పురుషశక్తియొక్క, దృశ్యశక్తియొక్క, సంయోగః = కలయిక, స్వరూపోపలబ్ధిహేతుః = ఆ పురుషుడు స్వరూపావస్థానము బడయుటలో కారణము స్వం అనగా దృశ్యము స్వామి = అనగా పురుషుఁడు.

తా॥ దృశ్యము పురుషుని కొఱకేగావున, అది పురుషునికి చెందినది. అందుచేత పురుషుడు దానికి స్వామి. ఈ పురుషప్రకృతుల యొక్క సంయోగమే, మొదట అవిద్యహేతువుగాగలదియైనను, క్రమముగా పురుషునికి తద్వియోగముద్వారా స్వరూపప్రతిష్ఠ కలుగును గావున, ఈ దృశ్యమే మోక్షమునకు మార్గము చూపించునదని చెప్పఁబడినది. దృశ్యము దృశ్యముగా నున్నంతవఱకు స్వరూపోపలబ్ధిలేదు అనగా మోక్షములేదు. ఆ దృశ్యము నశించుటచేతనే మోక్షము కలుగును. ఆ దృశ్యము నశించుటకుముందు దృశ్యముండవలెను గావున, దృశ్యసంయోగమే చివఱకు మోక్షమునకు దారిదీయునని చెప్పబడినది.

సూ॥ 67. తస్య హేతు రవిద్యా.

**తస్య = ఆ స్వస్వామిశక్తుల సంయోగమునకు, హేతుః = కారణము, అవిద్యా = అవిద్యయే.**

తా॥ దృగ్దృశ్యసంయోగము అవిద్యామూలకము. ఈ యవిద్య క్రమముగా విద్యకు దారితీయును గావున సంయోగమే మోక్షమునకు దారితీయునని తాత్పర్యము.

సూ॥ 68. తదభావా త్సంయోగాభావో హానం తద్దృశేః కైవల్యమ్.

**తదభావాత్ = తత్ = ఆ అవిద్యయొక్క, అభావాత్ = లేకపోవుట వలన సంయోగాభావః = సంయోగముయొక్క అభావము కలుగును, అదియే హానం = సంయోగము లేకుండ జేసికొనుట, తత్ = ఆ హానమే దృశేః = దృక్కుయగు పురుషునికి, కైవల్యమ్ = మోక్షము.**

తా॥ కేవలస్య భావః కైవల్యమ్. అనగా దృక్‌యగు పురుషునికి స్వరూపావస్థానము. అనగా Self-established in self ఈ స్థితినే గీతలో వర్ణించుచు 'ఆత్మన్యేవాఽఽత్మానం పశ్యన్నాత్మని తుష్యతి' అనగా ఆత్మయందే ఆత్మదర్శనము జేసికొనుచు ఆత్మయందు

ఆనందము పొందుస్థితి అనగా ఆత్మారామ స్థితి - ఇది యోగశాస్త్రమునకు ముఖ్య తాత్పర్యము. ఈ కైవల్యస్థితినే మోక్షమందురు. అనగా Extricating the self from the clutches of matter. ఈ కైవల్య స్థితి అవిద్యామూలకమైన దృగ్దృశ్యములయొక్క సంయోగమును, దృక్ వేఱు, దృశ్యము వేఱను వివేకరూపమైన విద్యచేత ఛేదించి దృక్ స్వరూపావస్థానమును పొందుట.

సూ॥ 69. వివేకఖ్యాతిః అవిప్లవా హానోపాయః.

**అవిప్లవా** = ఎడతెగని, వివేక**ఖ్యాతిః** = దృక్ వేఱు, దృశ్యము వేఱు అను జ్ఞానము, హానోపాయః=దృగ్దృశ్య సంయోగమును త్రోసిపుచ్చుటకునుపాయము.

తా॥ వివేకఖ్యాతి అన దృక్ వేఱు, దృశ్యము వేఱు అను నిశ్చయజ్ఞానము దృఢమై అనుభూతిలోనికి వచ్చిన పిమ్మటే దృగ్దృశ్య సంయోగము నశించి, దృక్‌కు స్వరూపోపలబ్ధి అనగా కైవల్యము సిద్ధించును. ఇచ్చట అవిప్లవా అను పదము వివేకఖ్యాతి, శబ్దజ్ఞాన మాత్రమేగాక దృఢానుభూతికొఱకై చెప్పబడినది.

సూ॥ 70. యోగాంగానుష్ఠానా దశుద్ధిక్షయే జ్ఞానదీప్తిః అవివేక ఖ్యాతేః.

యోగాంగానుష్ఠానాత్ = ముందు సూత్రములందు చెప్పబోవు యోగము యొక్క అష్టాంగముల ననుష్ఠానము చేయుటవలన, అశుద్ధిక్షయే=చిత్తమలముల క్షయము సిద్ధించగా, జ్ఞానదీప్తిః = జ్ఞానముయొక్క ప్రకాశము, **అవివేక ఖ్యాతేః** = వివేకఖ్యాతి ఉదయించు వఱకు అనుస్యూతముగా, అవిప్లవముగ ప్రవహించును.

తా॥ ఏ యోగాంగముల అనుష్ఠానముచేత, అశుద్ధిక్షయమై జ్ఞానదీప్తి కలుగునో ఆ యోగాంగములను చెప్పుచున్నారు.

సూ॥ 71. యమనియమాసన ప్రాణాయామప్రత్యాహారధారణాధ్యాన సమాధయోఽష్టావంగాని.

యమ....సమాధయః=యమము, నియమము, ఆసనము ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము చివఱకు సమాధి, ఇవి యోగలబ్ధికి అష్టౌ= ఎనిమిది, అంగాని=అంగములు.

తా॥ వీటియొక్క నిర్వచనములను చెప్పుచున్నారు.

సూ॥ 72. తత్రాఽహింసాసత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహాః యమాః.

యమాః=యమములనగా అనగా చిత్తమును హద్దులో పెట్టునవి, అహింసా=అహింసయు, సత్య=సత్యమును, అస్తేయ=పరద్రవ్యమును అపహరించు బుద్ధిలేకుండుట, బ్రహ్మచర్య=బ్రహ్మచర్యము, అపరిగ్రహాః= ఇతరులనుండి నేదియు ప్రతిగ్రహించకుండుట.

తా॥ వీటి గొప్పతనమును ముందు సూత్రమున వర్ణించు చున్నారు

సూ॥ 73. జాతిదేశకాలసమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహా వ్రతమ్

పైనఁజెప్పబడిన యమములు, జాతి . అనవచ్ఛిన్నాః=జాతిచేతగాని, దేశముచేతగాని, కాలముచేతగాని, సమయముచేతగాని, అవచ్ఛిన్నములుగావు. సార్వభౌమాః=అన్ని జాతులకు, అన్ని దేశములకు, అన్ని కాలములకు, అన్ని సమయములకు వర్తించునవి - ఇవియే మహావ్రతమ్=గొప్ప వ్రతము. ఇంత కంటె గొప్ప వ్రతములేదు.

తా॥ ఈ యమములు, బ్రాహ్మణులకేగాని ఇతరులకుగాదు అను జాతివివక్షలేదు. ఈ దేశమునకేగాని ఇతర దేశములకుగాదు అను దేశవ్యవస్థలేదు. ఈ కాలమునకేగాని మఱియొక కాలమునకు వర్తించవు అను కాలవివక్షలేదు. ఈ సమయమునకేగాని మఱియొక సమయమునకు వర్తించవు అను సమయవ్యవస్థలేదు.

సూ॥ 74. శౌచసంతోష తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః

ఇంక నియమాః = నియమములనగా శౌచః ...ప్రణిధానాని = శౌచము, సంతోషము, తపస్సు స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము.

సూ॥ 75. వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్,

వితర్కబాధనే = దుస్తర్కముయొక్క బాధకలుగుచుండగా, ప్రతిపక్షభావనమ్ = దానికి విరుగుడు అయిన భావనజేయవలెను.

తా॥ ఈ ఒక్క విషయములో అబద్ధమాడిన ప్రమాదము లేదు అను దుస్తర్కముదయించగా, దీనివలన నేను యోగభ్రష్టుడ నగుదును అని తన్ను తాను మందలించుకొనుచు పైన జెప్పబడిన యమ నియమములను జాగ్రత్తగా పరిపాలించుకొనవలెను.

సూ॥ 76. వితర్కాః హింసాదయః కృతకారితానుమోదితాః, లోభ క్రోధమోహపూర్వకాః, మృదుమధ్యాధిమాత్రాః దుఃఖాజ్ఞానానంతఫలాః ఇతి ప్రతిపక్షభావనమ్.

వితర్కాః = దుస్తర్కము వలన బుట్టిన, హింసాదయః = హింసాదులు కృతకారితానుమోదితాః = చేయబడినవి, చేయించబడినవి, అనుమోదింపబడినవి అని మూడు విధములు, లోభక్రోధమోహపూర్వకాః = లోభము, క్రోధము, మోహమువలన కలిగెడివి = అని తిరిగి మూడు విధములు, అవి, మృదు మధ్యాధిమాత్రకాః = కొద్దిగాను, సామాన్యముగాను, తీవ్రముగాను, జేయబడినవి అని తిరిగి మూడువిధములు ఇవి దుఃఖాజ్ఞానానంతఫలాః = ఇవి దుఃఖమును, అజ్ఞానమును అనంతముగా పుట్టించ గలవు అని భావనజేయుట ప్రతిపక్ష భావనమ్.

తా॥ ఈ ప్రతిపక్ష భావనము (Contrary autosuggestion) వలన అహింసాదుల యందు ప్రవృత్తిని తనంతటతాను మందలించు కొనవలెను. ఇంక యమములవలన కలుగు గుణములు జెప్పబడు చున్నవి.

సూ॥ 77. అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః.

అహింసా ప్రతిష్ఠాయాం = అహింసయందు ఈ ప్రకారము ప్రతిష్ఠ అనగా దృఢస్థితి కుదిరిన, తత్సన్నిధౌ = ఆ యహింసను తీవ్రముగా పాటించు మహనీయునియొక్క సన్నిధియందు, వైరత్యాగః = వైరము నశించును.

తా॥ ధర్మిష్ఠుని జూచి ఇతరులు ధర్మమార్గమందెట్లు ప్రవర్తింప నుత్సహింతురో, అహింస పాటించు వ్రతి యొక్క సన్నిధియందు జనులు హింసయందు ప్రవర్తించరు.

సూ॥ 78 సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్.

సత్యప్రతిష్ఠాయాం = సత్యమందుప్రతిష్ఠ కలుగుచుండగా, క్రియాఫలాశ్రయత్వమ్ = క్రియాఫలము సిద్ధించును.

తా॥ సత్యం వాచః ప్రతిష్ఠా అను నుపనిషద్వ్యాఖ్యానుసారము, సత్యమందు ప్రతిష్ఠితుడైన వాని వాక్కు అమోఘమై నీవు ధార్మికుడవగుదువుగాక అని ఆశీర్వదించిన, ఆశీర్వదింపబడినవాడు ధార్మికుడు కాగలడు, దీర్ఘాయుర్భూయాః = దీర్ఘాయుష్మంతుడవు గమ్ము అనిన దీర్ఘాయుష్మంతుడు కాగలడు.

సూ॥ 79. అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్.

అస్తేయమందు ప్రతిష్ఠ కుదిరిన, ఆతనికి సర్వరత్నోపస్థానమ్ ... సర్వ = సమస్తమైన, రత్న = రత్నములయొక్క, ఉపస్థానము = దగ్గఱజేరుట సంభవించును

తా॥ ఆశగల మానవునికి సంపదలు దూరమగును; నిరీహుని సంపదలు వరించును.

సూ॥ 80. బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః.

బ్రహ్మచర్యమందు ప్రతిష్ఠకుదిరిన, వీర్యలాభము కలుగును.

తా॥ అట్టివాడు ఊర్ధ్వరేతస్కుడై, సిద్ధుడై, ఇతరుల మనస్సుల జ్ఞానముదయింపజేయుశక్తి గలవాడగును -

సూ॥ 81. అపరిగ్రహస్థైర్యే జన్మకథంతా సంబోధః.

తా॥ అపరిగ్రహము యొక్క ప్రతిష్ఠ కుదిరిన, జన్మాంతరమందు నేనెవడను, ఇప్పుడు నేనెట్టివాడను, ముందెట్టివాడనగుదును ఈ ప్రకారమైన పూర్వాపరజన్మజ్ఞానముదయించును. ఈపైన నియమముల వల్ల కలుగు గుణములు జెప్పబడుచున్నవి.

సూ॥ 82. శౌచాత్స్వాంగజుగుప్సా, పరైరసంసర్గః.

శౌచాత్ = శౌచమువలన, స్వాంగమందు అసహ్యాభావము, పరైః = ఇతరులతో, అసంసర్గః = సంసర్గము లేకుండుట సిద్ధించును.

తా॥ శౌచమును పాటించినకొలది, తన దేహమందే హేయభావ ముదయించి, శరీరాభిమానము జయించి యతికాగలడు. తన దేహమందే అభిమానము వీడినవాడు ఇతరులతో సంసర్గమెట్లుకోరును.

సూ॥ 83. సత్త్వశుద్ధౌ సౌమనస్యైకాగ్ర్యేంద్రియజయాత్మదర్శన యోగ్యత్వాని.

సత్త్వశుద్ధౌ = శౌచమువలన సత్త్వశుద్ధికలుగగా, అనగా చిత్తశుద్ధికలుగగా, సౌమనస్య .. యోగ్యత్వాని, సౌమనస్యము మొదలగునవి సిద్ధించును.

తా॥ అనగా యోగ్యమైన మనస్సు కలుగుట, దానివలన ఏకాగ్రత్వము, తద్ద్వారా ఇంద్రియనిగ్రహము, క్రమముగ ఆత్మదర్శనము కలుగు యోగ్యత్వమేర్పడును.

సూ॥ 84. సంతోషా దనుత్తమః సుఖలాభః.

సంతోషాత్ = సంతుష్టివలన, అనుత్తమః = అంతకంటె ఉత్తమమైనది లేని, సుఖలాభః = సుఖము లభించుట కలుగును.

తా॥ సంతుష్టి కంటె గొప్ప సుఖము లేదు.

సూ ॥ 85. కాయేంద్రి యసిద్ధి రశుద్ధిక్షయా త్తపసః.

తపసః = తపస్సువలన, అశుద్ధిక్షయాత్ = అశుద్ధిక్షయమువలన కాయేంద్రియసిద్ధిః = కాయసిద్ధి అనగా అణిమాద్యష్టసిద్ధులు, ఇంద్రియసిద్ధి, యనగా దూరశ్రవణాదులు కలుగును.

తా ॥ తపస్సు అను నియమమునకు సాటిలేదు. దాని వలన కాయసిద్ధులు, ఇంద్రియసిద్ధులు కలుగగలవు

సూ ॥ 86. స్వాధ్యాయాదిష్టదేవతా సంప్రయోగః.

స్వాధ్యాయాత్ = స్వకీయమైన శాఖకు సంబంధించిన వేదము యొక్క అధ్యయనమువలన, ఇష్టదేవతా సంప్రయోగః = తన చేత అర్చించబడిన దేవతల యొక్క వశీకరణము కలుగును, ఆ దేవతలు స్వాధ్యాయశీలునికి దర్శనమిచ్చి ఆతని వశమందుందురు.

సూ ॥ 87. సమాధిసిద్ధి రీశ్వరప్రణిధానాత్.

ఈశ్వరప్రణిధానాత్ = ఈశ్వరుని యందు ఆత్మార్పణము వలన, సమాధి సిద్ధిః = సమాధియొక్క సిద్ధి క్రమముగా కలుగును.

తా ॥ ఇంతవఱకు నియమముల యొక్క ఉపయోగములు చెప్పబడినవి. ఇఁక మూఁడవదియైన యోగాంగమగు ఆసనము చెప్ప బడుచున్నది.

సూ ॥ 88. స్థిరసుఖమాసనమ్.

ఆసనం = ఆసనమనగా, స్థిరసుఖమ్ = కదలిక లేకుండా శరీరమునకు సుఖమునిచ్చేది. లేక స్థిరమైన సుఖమునిచ్చెడిది.

తా ॥ స్థిరసుఖమనునది ప్రసిద్ధమైన ఆసనములలో నొకటి ఆ యాసనములేవి యనగా—

1. పద్మాసనమ్, 2. వీరాసనమ్, 3 భద్రాసనమ్, 4. స్వస్తికమ్, 5. దండసనమ్, 6. సోపాశ్రయమ్, 7 పర్యఙ్కమ్, 8. క్రౌంచ నిషదనమ్, 9 హస్తినిషదనమ్, 10. ఉష్ట్రనిషదనమ్, 11. సమసంస్థానమ్, 12. స్థిరసుఖమ్, 13 యథాసుఖమ్. ఈ మొదలైనవి.

సూ॥ 89. ప్రయత్నశైథిల్యానంతసమాపత్తిభ్యామ్.

**ప్రయత్న . . సమాపత్తిభ్యాం = ప్రయత్నము లేకుండగను, అనంత మందు సమాపత్తిచేతను ఆసనసిద్ధి కలుగును**

తా॥ ఆసనములు వేయుట బాగా అలవాటైన పిమ్మట అప్రయత్నముగానే ఆసనము వేయగలుగుట సిద్ధించును, అదియుగాక అనంతమందు ఆత్మార్పణమును జేసిన (Sense of meger in the Infinite or Surrender in to the Infinite) ఆసనసిద్ధి కలుగగలదు. Living in the Infinite అనగా becoming a part and parcel in the Infinite shedding the sense of ego అహంకారము నశించి పరబ్రహ్మయందు లయించు చిత్తము కలుగుట అనంతసమాపత్తి యనఁబడును.

సూ॥ 90. తతో ద్వంద్వానభిఘాతః.

**తతః = ఆయాసన సిద్ధివలన, ద్వంద్వ = సుఖదుఃఖశీతోష్ణాదిద్వంద్వముల వలన అభిఘాతమేర్పడదు.**

తా॥ అనగా శీతోష్ణాది ద్వంద్వముల జయించుట కలుగును. ఇఁక ప్రాణాయామమును గూర్చిఁ చెప్పబడుచున్నది.

సూ॥ 91. తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయోః గతివిచ్ఛేదః ప్రాణాయామః.

తస్మిన్సతి = ఆయాసనశుద్ధి ఏర్పడగా, శ్వాసప్రశ్వాసయోః = ఉచ్ఛ్వాస నిశ్వాసలయొక్క, గతివిచ్ఛేదః = నడకను నిలుపుజేయుట ప్రాణాయామ మనఁబడును.

సూ॥ 92. బాహ్యాభ్యంతర స్తంభవృత్తిః దేశకాలసంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘసూక్ష్మః స్తంభవృత్తిః.

ఆ ప్రాణాయామము బాహ్యవృత్తి గలది, అభ్యంతరవృత్తి గలది, స్తంభ వృత్తి గలది అని మూడు విధములు గలదియై, దేశకాలసంఖ్యాభిః = దేశము చేతను, కాలము చేతను, సంఖ్యలచేతను, పరిదృష్టః = గణించబడినదైన, దీర్ఘ సూక్ష్మః = దీర్ఘమైనది, సూక్ష్మమైనది యగును.

తా॥ ఈ సూత్రమందు ప్రాణాయామముయొక్క అభ్యాస విధానము చెప్పబడినది. వాయువును ఉచ్ఛ్వసించి అనగా బయటకు విడచి కొంతకాలముండుట ఇట్టిది బాహ్యమనబడును. వాయువులు పీల్చి కొంత కాలముండుట ఇది అభ్యంతరమనబడును వాయువును పీల్చకుండ, విడవకుండ నుండుట స్తంభించుట యనబడును. కాలిన రాతి యందు నీరెట్లు ఆవిరియైపోవునో శ్వాసప్రశ్వాసల రెంటిని అపు చేసియుండుట స్తంభవృత్తి యనబడును. ఈ రకమైన అభ్యాసమును కొన్నిసార్లుచేయుట సంఖ్యాపరిదృష్టమందురు. కొంతకాలము చేయుట కాలపరిదృష్టమందురు. శ్వాసప్రశ్వాసలను చేసిన వాయువు యొక్క పరిమాణమునుబట్టి దేశపరిదృష్టమందురు. అనగా తక్కువ గాలియొక్క పరిమాణమునుబట్టి దేశపరిదృష్టమందురు. ఈ పై విధాన మును దీర్ఘకాలము సూక్ష్మముగా నభ్యసించుటవలన దీర్ఘ సూక్ష్మ మనబడును

సూ॥ 93. తతః క్షీయతే ప్రకాశావరణమ్.

తతః = ఆ ప్రాణాయామాభ్యాసము వలన, ప్రకాశావరణమ్....ప్రకాశ = బుద్ధి సత్త్వముయొక్క, ఆవరణమ్ = ఆవరించుమలము, క్షీయతే = క్షీణించును.

తా॥ అనగా రజోగుణతమోగుణములతో గలియని సత్త్వ బుద్ధిని బుద్ధిసత్త్వమందురు. ప్రతి మానవునియందు సత్త్వరజస్తమో గుణములు కొంత నిష్పత్తిలో నుండును. రజస్తమోగుణముల

పూర్తిగ నశింపఁజేసిన బుద్ధిసత్త్వము పెరుగును. ఈ బుద్ధిసత్త్వమునకే ప్రకాశమనిసంజ్ఞ. ఈ బుద్ధిసత్త్వమును రజస్తమోగుణములు ఆవరించి యుండును. ఈ రజస్తమోగుణముల ఆవరణమును ప్రాణాయామాభ్యాసము క్రమముగ క్షీణింపఁజేయును.

సూ ॥ 94. ధారణాసు యోగ్యతా మనసః.

ప్రాణాయామాభ్యాసఫలము జెప్పబడుచున్నది.

మనసః = చిత్తమునకు, ధారణాసు = ధారణలయందు, యోగ్యతా = యోగ్యత ఏర్పడును, ధారణయొక్క నిర్వచనము ముందు జెప్పఁబడును.

సూ ॥ 95. స్వవిషయా సంప్రయోగే చిత్తస్య స్వరూపానుకార ఇవేంద్రియాణాం ప్రత్యాహారః.

ఇంద్రియాణాం = ఇంద్రియములయొక్క, స్వవిషయ అసంప్రయోగే.... స్వవిషయ = ఇంద్రియార్థములయందు, అసంప్రయోగే = ప్రయోగములేని తఱి, చిత్తస్య = మనస్సుయొక్క, స్వరూపానుకార ఏవ = స్వరూపమును అనుకరించుట తటస్థించును దీనినే ప్రత్యాహారమందురు.

తా ॥ ప్రత్యాహారమనగా ఇంద్రియములను తద్వ్యాపారములనుండి ఉపసంహరించుట. దృశ్యమును జూడగోరు నేత్రమును దానినుండి ఉపసంహరించుట. గీతమును వినగోరు శ్రోత్రమును ఆ వినుటనుండి ఉపసంహరించుట. నేత్రమను ఇంద్రియమునకు స్త్రీసౌందర్యాది దృశ్యములు ఇంద్రియార్థము. ఇంద్రియములను ఇంద్రియార్థములనుండి ఉపసంహరించుట ప్రత్యాహారము. మనస్సు చంచలమగును ఇంద్రియములు చంచలములగును, "ఇంద్రియాణి హయానాహుః మనః ప్రగ్రహమేవ చ" అన్నట్లు, ఇంద్రియములు అశ్వములు, వాటినిలాగు కళ్లెము మనస్సు. కళ్లెమును సడలించిన గుఱ్ఱములు పరుగిడును, బిగించిన కట్టుబడును. కావున ఇంద్రియములు చిత్తమునను కరించుచుండును. ఇంద్రియముల నరికట్టిన చిత్తమరికట్టబడును.

సూ ॥ 96.    తతః పరమావశ్యతా ఇంద్రియాణామ్.

తతః = ఆ ప్రత్యాహారమువలన, ఇంద్రియాణాం = ఇంద్రియముల యొక్క, వశ్యతా = వశ్యమగుట, పరమా = ఎక్కువగా సిద్ధించును

తా ॥ ప్రత్యాహారమువలన ఇంద్రియములు వశీకృతము లగును.

సాధనాధ్యాయము సమాప్తము

# అథ తృతీయః విభూతిపాదః

* * *

మొదటి పాదమందు సమాధియనగానేమో జెప్పి, ద్వితీయ పాదమందు, తత్సాధనవిధానము జెప్పి, ఈ తృతీయ పాదమందు ఆ సాధనమును పూర్తిఁజేసి సమాధి వలన కలుగు సిద్ధులనుఁ జెప్పు చున్నారు

సూ॥ 97 దేశబంధః చిత్తస్య ధారణా.

యోగాంగముల నెనిమిదినిఁ జెప్పప్రారంభించి అందు మొదటి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారములగూర్చి నిర్వచనములనిచ్చి ఇఁక మిగిలిన మూడు యోగాంగములను గూర్చి జెప్పుచున్నారు. అందు ధారణ యను దాని నిర్వచన మీసూత్రమందు జెప్పఁబడినది.

చిత్తస్య = చిత్తముయొక్క, దేశబంధః = ఒకానొక స్థలమందు నిలుపుట, ధారణా = ధారణయనఁబడును.

తా॥ నాభిచక్రమందు, హృదయ పుండరీకమందు, శిరము నందు, నాసికాగ్రమందు ఈ ప్రకారము వివిధ ప్రదేశములందు చిత్తము నేకాగ్రము జేయుట ధారణయందురు.

సూ॥ 98 తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్.

ఈ సూత్రమందు ఏడవ యోగాంగమగు ధ్యానమునుగూర్చి జెప్పు చున్నారు.

తత్ర = ఆ యా నాభిచక్రాది ప్రదేశములందు, ప్రత్యయైకతానతా ప్రత్యయ = ఏ విషయము మనకు ధ్యేయమో, తద్విషయము అవిచ్ఛిన్న ప్రవాహ రూపముగా చిత్తమందుండుట ధ్యానమనఁబడును.

తా॥ ధ్యేయవస్తువువేరు ధారణా ప్రదేశమువేఱు, వేంక టేశ్వరుని ధ్యానించునప్పుడు ఆ వేంకటేశ్వరుని నాసికాగ్రమందుగాని, హృదయ పుండరీకమందు ఇట్లే తదితర ప్రదేశములందు దర్శించుట ధ్యానము ఈ ధారణ ధ్యానములు కలసియే యుండును. కేవలము నాసికాగ్రము మొదలగు ప్రదేశములందు మనస్సునుంచుట ధారణ కాగా, తత్ప్రదేశములందు ధ్యేయ వస్తువును నిరంతరము దర్శించుట ధ్యానము. ఇఁకముందు సూత్రమందు సమాధి శబ్దనిర్వచనము చెప్పబడుచున్నది.

సూ॥ 99. తదేవాఽర్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః.

తదేవ = ఆ ధ్యానమే, అర్థమాత్ర నిర్భాసం = ధ్యేయవస్తువే గోచరించు విధముగ, స్వరూపశూన్యమివ = నేనీవస్తువును దర్శించుచున్నానను జ్ఞానము లేనట్లుగా నుండుట, సమాధిః = సమాధియనబడును

తా॥ హృదయ పుండరీకమందు భగవన్నారాయణుని నిరంతరము దర్శించుచుండగా, కేవలమూనారాయణస్వరూపమే కళ్ళకు కట్టినట్లుండి, "నేను నారాయణుని జూచుచున్నానను ఎరుకలేకుండగ, చిత్తము నారాయణమయముగా నగుట" సమాధియనబడును.

సూ॥ 100. త్రయమేకత్ర సంయమః

ఇది చాల ముఖ్య సూత్రము, ఏకత్ర = ఒకేతటి, త్రయం = ధారణాధ్యాన సమాధులున్నప్పుడు ఆ స్థితిని సంయమమందురు

తా॥ యమనియమాసన ప్రాణాయ ప్రత్యాహారములు నడచు చుండగా హృదయ పుండరీకాదులగు నొకానొక స్థలమందు నారా యణాది ధ్యేయములనుంచి, చిత్తమును నారాయణమయమొనర్చి, ఇతరమైన ఏ తెలివిక లేకుండనుండిన, ఆ ధారణాధ్యాన సమాధి త్రయమునకు సంయమమని పేరు. ఈ సంయమమువలన గలుగు విశేష మును జెప్పబోవుచున్నారు.

సూ ॥ 101 తజ్జయాత్ప్రజ్ఞా లోకః.

తజ్జయాత్ = ఆ సంయమమును జయించుటవలన, ప్రజ్ఞాలోకః=సమాధి ప్రజ్ఞ విశారదమగును అనగా ఆ సంయమాభ్యాసము కాగా కాగా విశారదమగు సమాధిప్రజ్ఞ దృఢమగును

తా ॥ ఇట్టి సమాధి ప్రజ్ఞ సిద్ధించినయోగికి వివిధమైన యోగస్థాయి కలుగుచుండును పరచిత్తజ్ఞానము అనగా ఎదుటివాని మనస్సులో నుండు విషయమును ఇంద్రియసిద్ధి (85 సూత్రములోఁ జెప్పబడిన తపోమూలకమైన శక్తి) అనునది ఒకానొక భూమికలో సిద్ధించిన, దానిపై స్థాయిలో మఱియొక స్థాయి కలుగుచుండును. యోగసిద్ధిలోఁగూడ తరగతులు గలవు. నాలుగవ తరగతి జదివిన బాలుడు ఐదవ తరగతిలో ప్రవేశించురీతి క్రిందభూమికను జయించిన యోగి పై భూమి కాజయము కొఱకు యత్నించును. ఈ విషయమును ముందు సూత్రమున జెప్పుచున్నారు.

సూ ॥ 102 తస్య భూమిషు వినియోగః.

తస్య = ఆ సమాధి ప్రజ్ఞావైశారద్యముయొక్క, వినియోగః=ఉపయోగము, భూమిషు = పూర్వపూర్వ భూమికలనుండి ఉత్తరోత్తర భూమికాజయము, కొఱకు వినియోగమేర్పడును.

తా ॥ క్రింది మెట్టు ఎక్కకుండ పై మెట్టు ఎక్కుట కష్టము, అంతే క్రిందభూమిక జయించినయోగి పై భూమికను బొందగోరును ఈ భూమిక వెంబడి మఱియొక భూమిక గలదను జ్ఞానము యోగికి స్వయముగానే గోచరించును. యోగమే యోగికి గురువుగానగును దానినే ఈ క్రింది శ్లోకముఁ జెప్పుచున్నది.

యోగేన యోగో జ్ఞాతవ్యః యోగో యోగాత్ప్రవర్తతే।
యోగాప్రమత్తస్తు యోగేన స యోగే రమతే చిరమ్ ॥

యోగము చేతనే యోగముయొక్క పైస్థాయి దెలియబడును.

యోగము నుండి యోగవై శారద్యము వృద్ధినొందుచుండును అప్రమత్తుడైన యోగి తద్యోగమందే రమించుచు క్రమముగా ఉత్తరోత్తర భూమికలను జయించుచుండును

సూ॥ 103. త్రయమంతరంగం పూర్వేభ్యః.

పూర్వేభ్యః = ముందు జెప్పబడిన యమనియమాసనప్రాణాయామ ప్రత్యాహారములైదింటి కంటె, త్రయం = ధారణాధ్యాన సమాధిత్రయం, అంతరంగ మనబడును.

తా॥ యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహారములను పంచయోగాంగములు బహిరంగములుగాగ, వాటిపై మెట్టులైన ధారణాధ్యాన సమాధులు వాటికి అంతరంగమని జెప్పబడును

సూ॥ 104. తదపి బహిరంగం నిర్బీజస్య.

నిర్బీజస్య = నిర్బీజసమాధికి, తదపి = ఆసంయమము గూడ, బహిరంగం = బహిరంగమే

తా॥ సంయమమందు సబీజసమాధియే సిద్ధించును. ఇది సగుణోపాసన వంటిది, అనగా పరమేశ్వరుని విగ్రహరూపమున ధ్యానించుట వంటిది. సగుణోపాసన సిద్ధించిన పిమ్మటయే నిర్గుణోపాసన యలవడును. అట్లే సబీజసమాధి సిద్ధించినగాని, నిర్బీజసమాధి సిద్ధించదు. ధారణాధ్యాన సమాధులను త్రయము సంయమమనబడుచుండ ఆసంయమసిద్ధిలో గూడ ధ్యేయవస్తువు బీజరూపముననుండు గావున సబీజసమాధి యందురు. నిర్బీజ సమాధియందా ధ్యేయవస్తువు గూడలయించి చైతన్యము స్వరూపప్రతిష్ఠ జెందును. తత్‌స్థితిని నిర్బీజ సమాధి యందురు కావున ధారణాధ్యాన సమాధిత్రయరూప సంయమమును సబీజసమాధి ముందుఁజెప్పబోవు నిర్బీజసమాధికి బహిరంగము అనగా పూర్వరంగము మాత్రమే యని తాత్పర్యము. ఇఁక

సమాధి వలన సిద్ధులెట్లు గలుగునో జెప్పబోవుచు, వాటికి ముప్పిధము లైన పరిణామములు గలుగవలయునని, యీ మూడు పరిణామములను జెప్పుచున్నారు. వాటి పేర్లు ధర్మపరిణామము, లక్షణపరిణామము అవస్థాపరిణామ మనునవి.

సూ 105 వ్యుత్థాన నిరోధసంస్కారయో రభిభవప్రాదుర్భావౌ నిరోధక్షణ' చిత్తాన్వయః నిరోధపరిణామః

వ్యుత్థాననిరోధ సంస్కారయోః=వ్యుత్థానసంస్కారము, నిరోధసంస్కారము అను రెండు సంస్కారముల యొక్క, క్రమముగా, అభిభవప్రాదుర్భావౌ = జయింపఁబడుట, ఉద్భవించుటలున్నూ, నిరోధక్షణచిత్తాన్వయః = నిరోధక్షణ మందుండు చిత్తస్థితిని క్రమాభ్యాసము వలన సంపాదించుట, నిరోధపరిణామః= నిరోధపరిణామమనిఁ జెప్పబడును

తా॥ వ్యుత్థాన సంస్కారములనగా మనస్సుక్షిప్త, మూఢవిక్షిప్తా వస్థలయం దుండునప్పుడు కలుగు వాసనలు, క్షిప్తమనగా చలించునది. మూఢమనగా నిద్రాణమైనది. లేక మోహాగ్రస్తమైనది. విక్షిప్తమనగా విశేషముగా చలించునది ఇట్టియవస్థలయందున్న చిత్తము వ్యుత్థాన మని జెప్పబడును ఇక ఏకాగ్రమని, నిరుద్ధమని మఱి రెండుయవస్థలు చిత్తమునకు గలవు. ఇట్టి చిత్తము సమాహితమగుటకు అనగా సమాధిని బొందుటకు అవకాశమున్నది. చిత్తమునకు వ్యుత్థాన వాసనలు విక్షేపము గలుగజేయుచుండ, యోగమందాసక్తిగలవాడు దానిని నిరోధించుటకు యత్నించును. ఈ ప్రకారము వ్యుత్థానమగు చిత్తము యొక్క తత్సంస్కారములను క్రమముగతగ్గించి, నిరోధాభిముఖముగ జేయుచుండగా క్రమముగ చిత్తమునకు నిరోధపరిణామము సిద్ధించును. పై సూత్రార్థము భోజరాజవృత్తి ప్రకారము వ్రాయబడినది వాచస్పతిమిశ్రులు దీని నన్యథా వ్యాఖ్యానించియున్నారు. ఇక్కడ సందర్భము, సబీజ సమాధినుండి నిర్బీజ సమాధికి వెళ్లు విధానమును వర్ణించునదియే అగుటచేత, ఇచ్చట వ్యుత్థానసంస్కారములనగా సబీజ

సమాధి సంస్కారములని యర్థముజెప్పుచు నిరోధసంస్కారములనగా నిర్బీజసమాధి సంస్కారములని వాచస్పతి మిశ్రులు వ్యాఖ్యానించిరి, సబీజసమాధి లేక సంప్రజ్ఞాత సమాధి కలిగినను, చిత్తము యొక్క వ్యుత్థాన సంస్కారములు అనగా బహిర్ముఖ సంస్కారములు. బహిర్ముఖజ్ఞానోత్పాదకములు అట్టి బహిర్ముఖజ్ఞానమును నిరోధించినను అవి నిరోధింపబడవు అవి నిరోధ సంస్కారములచేతనే నిరోధింపబడుచువచ్చును. ప్రత్యయమనగా జ్ఞానము. సంస్కారమనగా వాసన. వాసనాక్షయముచేతనే వాసనలను జయించవలెను. అందుచేత వ్యుత్థాన వాసనలను కాలక్రమమున నిరోధవాసనలచేత నిరోధించుచు వెళ్లగా చిత్తమునకు నిరోధపరిణతి యబ్బును

సూ॥ 106. తస్య ప్రశాంతవాహితా సంస్కారాత్

తస్య=ఆ నిరోధ పరిణామమందు, సంస్కారాత్ = నిరోధ సంస్కార బలమువలన, చిత్తమునకు ప్రశాంతవాహితా = ప్రశాంతప్రసారము సిద్ధించును.

తా॥ నిరోధ సంస్కారము బలమైనకొలది, చిత్తప్రసారము ప్రశాంత నదీప్రవాహము వలెనుండును. నిరోధ సంస్కార బలము తగ్గినచో వ్యుత్థాన సంస్కారములు తలయెత్తుచుండును.

సూ॥ 107. సర్వార్థతైకాగ్రతయోః క్షయోదయౌ చిత్తస్య సమాధి పరిణామః

చిత్తస్య = చిత్తమునకు, సర్వార్థతైకాగ్రతయోః = పలుపలువిషయము లందు ప్రసారమునకు, ఏకాగ్రస్థితికిని, క్రమముగా క్షయోదయౌ=క్షీణించుట, ఉదయించుటలు, సమాధిపరిణామః = సమాధిపరిణామమనబడును.

తా॥ 105వ సూత్రమందు వ్యుత్థానసంస్కారములను ధర్మమునుండి, నిరోధసంస్కారములను, ధర్మమునకు ప్రగతి వర్ణింపబడినదిగావున అది నిరోధసంస్కారరూపమైన చిత్తధర్మముయొక్క పరిణామమని జెప్పఁబడినది. ఈసూత్రమందు లక్షణపరిణామమను

విషయము వర్ణించబడుచున్నది సర్వార్థతా అనగా చిత్తమునకు పలువిషయములందు ప్రసార మొకలక్షణము, ఏకాగ్రతను బొందుట మఱియొక లక్షణము. మొదటిలక్షణమునుండి రెండవలక్షణమును చిత్తము సంపాదించిన సమాధిపరిణామమను లక్షణపరిణామము సిద్ధించును.

సూ॥ 109 తతః పునః శాంతోదితౌ తుల్యప్రత్యయౌ చిత్తస్య ఏకాగ్రతా పరిణామః.

తతః = ఆ యవస్థనుండి అనగా సర్వవిషయములందు సంచరించు చిత్తము ఏకవిషయమందు నిలబడజేయు సమాధిపరిణామాభ్యాసవశమువలన, పునః = తిరిగి, పూర్వసంస్కారముడిగి అనగా సర్వార్థతావస్థ ఉడిగి ఏకాగ్రావస్థ ఉదయించుచు ఈ ప్రకారము కొంతకాలము పూర్వావస్థ తలయెత్తుచు నుత్తరావస్థ దానిని అణచివేయుచు నీ ప్రకారమైన తీవ్రాభ్యాసవశమున ఏకాగ్రతాపరిణామము సిద్ధించును

తా॥ ఇచ్చట నొక విషయము గనునించదగినది. సంప్రజ్ఞాత సమాధి సిద్ధించిన పిమ్మట అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించు మార్గమున మూడు అవస్థలగుండా చిత్తము నడచును. వ్యుత్థాన ధర్మములను పూర్తిగావీడి, నిరోధ ధర్మమును సంపాదించి, నిరోధ ధర్మము నుండి ఏకాగ్ర ధర్మమునుబొంది, తదేకాగ్ర ధర్మము నుండి జారిపోకుండ నక్కడ చిత్తము స్థాయిగా నుండుట ఏకాగ్రతా పరిణామమని వర్ణింపబడినది అనగా మొదట నిరోధపరిణామమబ్బవలెను. దాని నుండి సమాధి పరిణామమును సంపాదించవలయును, దాని నుండి తిరిగి ఏకాగ్రత పరిణామమును చిత్తము బొందవలెను ఈ పరిణామత్రయము క్రమముగ నసంప్రజ్ఞాత సమాధికి మార్గమగును.

సూ॥ 110 ఏతేన భూతేంద్రియేషు ధర్మలక్షణావస్థా పరిణామా వ్యాఖ్యాతాః

ఏతేన = ఈపైనఁజెప్పబడిన మూడు సూత్రముల విషయముచేత, భూతేంద్రియేషు = భూతముల యందు నింద్రియములందు, ధర్మలక్షణావస్థాపరిణామాః = ధర్మపరిణామము, లక్షణపరిణామము, అవస్థాపరిణామము అను మూడు పరిణామములు, వ్యాఖ్యాతాః = వ్యాఖ్యానింపబడినవి.

సూ॥ 111 పరిణామత్రయ సంయమాత్ అతీతానాగతజ్ఞానమ్.

పరిణామత్రయ సంయమాత్ = పైన జెప్పబడిన మూడు పరిణామముల యందు ధారణాధ్యాన సమాధి త్రయమను సంయమమువలన, అతీతానాగత జ్ఞానమ్ = భూతభవిష్యత్కాలజ్ఞానము కలుగును. ఇది యొకసిద్ధి.

సూ॥ 112. శబ్దార్థప్రత్యయానాం ఇతరేతరాధ్యాసాత్ సంకరః తత్ప్రవిభాగ సంయమాత్ సర్వభూతరుతజ్ఞానమ్.

శబ్దార్థప్రత్యయానాం = గౌః అనుశబ్దము, ఆశబ్దమునకు గోవు అనునర్థము, గోవును జూచుచున్నాను అనుజ్ఞానము, ఈ మూడు గోదర్శనముకాగా అవిభక్తముగాగలిగిన వాటికి, సంకరః = సాంకర్యమేర్పడును, తత్ప్రవిభాగ సంయమాత్ = ఆ మూడు వేరు అను భావము మీద, సంయమాత్ = సంయమము జేయుటవలన, సర్వభూతరుతజ్ఞానమ్ = అన్ని భూతములయొక్క అనగా పశుపక్ష్యాదుల యొక్క శబ్దములందలి భావమును గ్రహించు శక్తి కలుగును

సూ॥ 113. సంస్కారసాక్షాత్కరణాత్ పూర్వజాతిజ్ఞానమ్.

సంస్కారసాక్షాత్కరణాత్ = సంస్కారములయొక్క సాక్షాత్కరించుకొనుటవలన, పూర్వజాతిజ్ఞానమ్ = పూర్వజన్మజ్ఞానము కలుగును.

తా॥ సంస్కారములు రెండు రకములు. స్మృతిని కలుగజేయునవి అవిద్యాదిక్లేశములను కలుజేయునవి ఒకరకము. కర్మఫలమునిచ్చు ధర్మాధర్మరూపములైన వాసనలనునవి రెండవ రకము.

వీటిని సాక్షాత్కరించుకొనుటవలన పూర్వజన్మజ్ఞానముదయించును. ఈ రకమైన పూర్వజన్మజ్ఞానము జైగీషవ్యుడను మహర్షికి కలిగినట్లు ఉపనిషత్కథ.

సూ 114 ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్.

ప్రత్యయస్య = ఎదుటనున్న పురుషునియొక్క ముఖరాగాదుల జ్ఞానము యొక్క, సంయమాత్ = సంయమము జేయుట వలన, పరచిత్త జ్ఞానమ్ = ఇతరుల మనస్సులలో నుండు విషయమును గ్రహించుట కలుగును

సూ॥ 115. న చ తత్ సాలంబనం తస్య అవిషయీ భూతత్వాత్.

తత్ = ఆ పరచిత్తజ్ఞానము, సాలంబనం న = ఆలంబన సహితమైనదిగాదు. తస్య = ఆ యాలంబనము, అవిషయీభూతత్వాత్ = గ్రహించుటకు వీలులేనిదగుట వలన,

తా॥ ఒకవ్యక్తి ముఖమునుజూచి "ఇతను ఒకస్త్రీని అనురాగముతో స్మరించుచున్నాడు అని యోగికి ప్రత్యక్షమగును, కాని ఆ స్త్రీయెవరో దెలియుటకష్టము ఈశక్తికూడ రావలెనన్న ప్రణిధానమువలన కాలక్రమముచేత గోచరించును

సూ॥ 116. కాయసంయమాత్ తత్ గ్రాహ్యశక్తి స్తంభే అంతర్ధానమ్

కాయసంయమాత్ = కాయ = శరీరమందు, సంయమాత్ = సంయమము జేయుట వలన, అనగా శరీరమునకు ఏరూపమున్నదో, తత్ గ్రాహ్యశక్తి స్తంభే తత్ = ఆరూపముందున్న, గ్రాహ్యశక్తి = గ్రహింపబడుశక్తియొక్క స్తంభే = ప్రతిష్టంభము జేసిన సందర్భమున, యోగి అంతర్ధానమ్ = అంతర్ధానము బొందును.

తా॥ యోగితన శరీరరూపమును గ్రహించు ఎదుటివాని యొక్కశక్తిని అరికట్టి ఈ నంతర్ధానము కాగలడు.

తా॥ ఆ మైత్రి సంయమమువలన జీవలోకమును సుఖింపఁ జేయగల శక్తి పుట్టును. కరుణాసంయమమువలన రోగికి రోగమును బోగొట్టు శక్తికలుగును. ముదిత సంయమమువలన అనగా పుణ్యకర్మలను జేయు వారిని జూచి సంతోషించుటయందు సంయమమునలన ఆ పుణ్యకర్మలను జేయు వారికి మరింత బలముదయించును

సూ॥ 119 బలేషు హస్తి బలాదీని.

బలేషు = బలములయందు సంయమమువలన, హస్తిబలాదీని = ఏనుగు బలమువంటి బలము కలుగును

తా॥ ఏనుగుబలమందు సంయమము జేసిన అనగా ధారణాధ్యానసమాధుల జేసిన ఏనుగుబలము, వాయుబలమందు సంయమము జేసిన వాయుబలము, వైనతేయి అనగా గరుత్మంతుని బలమందు సంయమము జేసిన తద్బలము జేకూరును.

సూ॥ 120 ప్రవృత్త్యా లోకన్యాసాత్ సూక్ష్మవ్యవహిత విప్రకృష్ట జ్ఞానమ్.

ప్రవృత్త్యా లోకన్యాసాత్ = వెనుకఁజెప్పబడిన జ్యోతిష్మత్యాది ప్రవృత్తులయొక్క సాత్త్విక ప్రకాశమునలన, సూక్ష్మ .జ్ఞానమ్ = సూక్ష్మమైన విషయములయొక్క వ్యవహిత విషయములయొక్క అనగా గోడకవతల వైపున నున్నట్టివి మొదలగు విషయములయొక్కయు, దూరమందున్న విషయములయొక్కయు జ్ఞానము కలుగును

సూ॥ 121. భువనజ్ఞానం సూర్యే సంయమాత్

సూర్యే = సూర్యునియందు, సంయమాత్ = సంయమమువలన, భువనజ్ఞానం = చతుర్దశ భువనములయొక్క జ్ఞానము కలుగును

తా॥ భువనజ్ఞానమనగా ఆంగ్లములో Cosmogony and Cosmology అను శాస్త్రములు, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము, ఈ షట్లోకములు

భూలోకములోగలిపి ఏడు ఊర్ధ్వలోకములు, ఆశ్లే సహోతల రసాతల అతల వితల తలాతల పాతాళములను సప్త అధోలోకములు వీటి వ్యవస్థ యొక్క జ్ఞానముకలుగును.

సూ॥ 122. చంద్రే తారావ్యూహజ్ఞానమ్.

చంద్రే = చంద్రునియందు సంయమముఁజేసిన, తారావ్యూహజ్ఞానమ్ = నక్షత్రవ్యూహములెట్లున్నవో వాటిజ్ఞానము సిద్ధించును.

సూ॥ 123. ధ్రువే తద్గతిజ్ఞానమ్

ధ్రువే = ధ్రువనక్షత్రమందు సంయమముజేసిన, తద్గతిజ్ఞానము = తత్ = ఆ నక్షత్రములయొక్క గతి = గతులయొక్కజ్ఞానముకలుగును.

సూ॥ 124. నాభిచక్రే కాయవ్యూహజ్ఞానమ్

నాభిచక్రే = షోడశాకారమైన నాభిచక్రమందు సంయమముఁజేసిన, కాయవ్యూహజ్ఞానమ్ = శరీరములనుండు వాతపిత్తశ్లేష్మాది త్రిదోషములు, త్వగ్లోహిత మాంసస్నాయ్వస్థిమజ్జాశుక్రములను సప్తధాతువులు, నాడులు, మొదలగు శరీరాంతరావయవజ్ఞానము సిద్ధించును

సూ॥ 125. కంఠకూపే క్షుత్పిపాసా నివృత్తిః

కంఠకూపే = కంఠకూపమందు సంయమమువలన క్షుత్పిపాసానివృత్తిః క్షుత్పిపాసలయొక్క నివృత్తి కలుగును.

తా॥ జిహ్వకు అడుగున ఒక నరముండును. దానికి అడుగున కంఠము దానికి అడుగున కంఠకూపముండును అచ్చట ప్రాణాదివాయువులచ్చట సంపర్కముఁబొందగా క్షుత్పిపాసలు కలుగును కావున నా కంఠ కూపమందు సంయమమువలన క్షుత్పిపాసలను జయించువాడగును.

సూ॥ 126. కూర్మనాడ్యాం స్థైర్యమ్.

కూర్మనాడ్యాం = కూర్మనాడియందు సంయమమువలన స్థైర్యమ్ = స్థైర్యము చేకూరును.

తా॥ కంఠకూపమునకు లోపల కూర్మాకారమైన నాడి గలదు. అచ్చట సంయమముఁజేసిన, సర్పమువలె నిశ్చలమైయుండు శక్తిసిద్ధించును

సూ॥ 127. మూర్ధజ్యోతిషి సిద్ధదర్శనమ్.

మూర్ధజ్యోతిషి = బ్రహ్మరంధ్రమందుండు అంతశ్ఛిద్రమందున్న భాస్వరమైన జ్యోతిస్సునందు సంయమమువలన సిద్ధదర్శనమ్ = సిద్ధులయొక్క దర్శనము సిద్ధించును.

తా॥ సిద్ధులనువారు అంతరిక్షమందు మానవుల కదృశ్యులై సంచరించుచుందురువారిని చూచి వారితో సంభాషించు శక్తికలుగునని తాత్పర్యము.

సూ॥ 128. ప్రాతిభాద్వా సర్వమ్

ప్రాతిభాత్ వా = వివేకఖ్యాతికి పూర్వమందు ప్రాతిభములేక తారకమను జ్ఞానముదయించును దాని వలన పైనఁజెప్పబడిన వివిధజ్ఞానము కలుగును సూర్యోదయమునకు ముందు ఉషఃకాంతులవలె వివేక ఖ్యాతియనుజ్ఞానోదయమునకు బూర్వ మీ ప్రాతిభమను ప్రతిభాశక్తి (Spiritual Intuition) ఉదయించును. దీనివలన సర్వము దెలియు శక్తి సిద్ధించును

సూ॥ 129. హృదయే చిత్తసంవిత్

హృదయే = హృదయమందు సంయమముజేసిన, చిత్త సంవిత్ = పరుల చిత్తముల జ్ఞానముదయించు .

సూ॥ 130 సత్త్వపురుషయోః అత్యంతా సంకీర్ణయోః ప్రత్యయా విశేషః భాగః పరార్థత్వాత్ స్వార్థసంయమాత్పురుష జ్ఞానమ్.

అత్యంతా సంకీర్ణయోః = అత్యంతము సంబంధములేని, సత్త్వపురుషయోః = బుద్ధిసత్త్వము, పురుషుడు అను రెంటియొక్క ప్రత్యయావిశేషః = భేదజ్ఞానము లేకపోవుటయే. భోగః = ప్రపంచ భోగమనబడుచున్నది. ఈ భోగము పరార్థత్వాత్ = పురుషుని కొఱకు ఉద్దేశింపబడిన దగుటవలన, స్వార్థ సంయమాత్ = అహంకారాదుల వీడి (Shedding egoism) ఆ పురుషుని యందు పురుషుడే సంయమము జేయుటవలన, పురుష జ్ఞానము = ప్రత్యగాత్మ యను పురుషుని జ్ఞానము సిద్ధించును.

తా॥ "విజ్ఞాతార మరేకేన విజానీయాత్" అను ఉపనిషద్వాక్యము "తెలుసుకొనే వానినెవరు తెలిసికొందురు" అన్నట్లు, పురుష జ్ఞానము అనగా తనయాత్మను తనయాత్మయే తెలుసుకొనఁగలుగును. బుద్ధివేఱు ఆత్మ వేరు, ఈ రెండు వేఱు అను జ్ఞానము విద్వాంసులకు గూడ గలుగదు ఆత్మజ్ఞానరూపము చైతన్యరూపము. ఆత్మశక్తి సంక్రమించుటచేత అచేతనము, అజ్ఞానరూపమైన బుద్ధికి బుద్ధిత్వధర్మము సిద్ధించుచున్నది ఈ భావమునే వేదాంతమందు బుద్ధిని అంతఃకరణ ప్రతిబింబిత చైతన్యమందురు. The Intellect shines in borrowed light not by itself బుద్ధి. పురుషుడు వేఱువేఱను జ్ఞానము లేకయే "లోకము భోగాసక్తమగును ఈ ప్రపంచమను "దృశ్యము ఆత్మయొక్క భోగముకొఱకు సృజింపబడినదను జ్ఞానము రూఢమై, ఆత్మయందే ఆత్మసంయమముఁ జేసిన ఆత్మజ్ఞానము సిద్ధించును.

సూ॥ 131. తతః ప్రాతిభ శ్రావణవేదనాదర్శాస్వాదవార్తాః జాయంతే.

తతః = ఆ పురుషునియందు సంయమమువలన, ప్రాతిభ...వార్తాః = సూక్ష్మ వ్యవహిత విప్రకృష్టజ్ఞానమును ప్రాతిభము (Spiritual Intuition)

దివ్య శబ్ద శ్రవణము, దివ్యస్పర్శ జ్ఞానము, దివ్యరూప వేదనము, దివ్యరసానుభూతి, దివ్యగంధజ్ఞానము ఇవన్నియు గలుగును.

సూ॥ 132 తే సమాధా వుపసర్గాః వ్యుత్థానే సిద్ధయః తే = పైనం జెప్పఁబడిన ఆయా దివ్యానుభూతులు

సమాధౌ = నిర్బీజ సమాధి విషయమై, ఉపసర్గాః = విఘ్నములు, వ్యుత్థాన సిథియందు, సిద్ధయః = సిద్ధులని యందురు.

తా॥ ఈ సిద్ధులు ప్రపంచదృష్టిగలవానికి ప్రపంచవశీకరణము కొఱకు నుపయోగించునేగాని, నిర్బీజసమాధిగోరు యోగిపుంగవునకు విఘ్నకరులై తన్మార్గమునుండితప్పించి లోకదృష్టిగలవానిగా జేయును.

సూ॥ 133. బంధకారణశైథిల్యాత్ ప్రచారసంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః.

బంధ కారణ శైథిల్యాత్ = కర్మాశయము బంధకారణము గావున, తద్వాసనలు సమాధివలన క్షీణించుటవలన, ప్రచార సంవేదనాచ్చ = చిత్త ప్రచారము యొక్క జ్ఞానమువలన, చిత్తస్య = చిత్తమునకు, పరశరీరావేశః = మఱియొకని శరీరమందావేశింపజేయు సిద్ధి గలుగును.

తా॥ వాసనాక్షయము సిద్ధించిన యోగి తనచిత్తమును తన శరీరమునుండి దీసి పరశరీరమందు ప్రవేశింపజేయగలడు.

సూ॥ 134 ఉదానజయాత్ జలపఙ్క కంటకాదిష్వసంగః ఉత్క్రాంతిశ్చ.

ఉదానజయాత్ = కంఠదేశస్థమైన ఉదాన వాయువుయొక్క జయమువలన, జల కంటకాదిషు = జలమందు, బురదయందు, ముండ్లయందు చరించుచున్నను, అసంగః = సంగముండదు.

తా॥ ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులని, ప్రాణస్వరూపమైన వాయువు ఐదు విధములై శరీరమందు సంచరించుచుండును ప్రాణము హృదయమందు, అపానము గుదమందు, సమాన

వాయువు నాభిమండలమందు, ఉదానము కంఠదేశమందు, వ్యానవాయువు శరీరమంతటను సంచరించుచుండును. వ్యానవాయువు, మృతునిగూడ వీడదు. ఈ యైదు వాయువులం దుదానవాయు జయము సిద్ధించెనేని నీటిలోనడువగలుగును అగ్నియందు నడువగలుగును. ఈ రకమైనసిద్ధులేగాక ఉత్క్రాంతిశ్చ = స్వేచ్ఛామరణము గూడ సిద్ధించును.

సూ॥ 135 సమాన జయాత్ జ్వలనమ్.

సమాన జయాత్ = సమాన వాయువుయొక్క జయము వలన, జ్వలనమ్ = యోగికి అగ్నివలె తేజోరూపముగ గన్పట్టుట సిద్ధించును (The yogi develops an aura)

సూ॥ 136. శ్రోత్రాకాశయోః సంబంధ సంయమాత్ దివ్యం శ్రోత్రమ్.

శ్రోత్రాకాశయోః = శ్రోత్రము, ఆకాశము వీటియొక్క, సంబంధ సంయమాత్ = సంబంధమందు సంయమము వలన, దివ్యం శ్రోత్రమ్ = దివ్యమైన శ్రోత్రము సిద్ధించును.

తా॥ ఆకాశము శబ్దగుణకము ఒకచోటజేసినశబ్దము సర్వాకాశవ్యాపియగును ఆ శబ్దము గ్రహించునది శ్రోత్రము. సర్వాకాశవ్యాపియైన శబ్దమును మానవశ్రోత్రములు వినలేవు. సమీపమందు బుట్టిన శబ్దము వినగలుగుదురు. చెవిటివాడు శ్రోత్రవ్యాధిచేత సమీపమందు బుట్టిన శబ్దమునుగూడ వినలేడు. శ్రోత్రమునకు ఆకాశమునకు గలసంబంధమందు సంయమముజేసిన యోగికి దివ్యశ్రోత్రముసిద్ధించును. అనగా ప్రపంచమున నెచ్చటనైనను బయలుదేరిన శబ్దమును వినగలుగును. ఇట్టి దివ్య శ్రోత్రమువలననే బ్రహ్మర్షులు సమాధినిష్ఠలో నుండగా శ్రుతులనువిని వాటిని ప్రజలకందించిరని సంప్రదాయము. దివ్యశ్రోత్ర గోచరమైన శబ్దములుగావుననే వాటికి శ్రుతులని పేరు.

సూ॥ 137. కాయాకాశయోః సంబంధ సంయమాత్।
లఘుతూల సమాపత్తేశ్చ ఆకాశగమనమ్॥

కాయాకాశయోః = శరీరము యొక్కయు, ఆకాశము యొక్కయు, సంబంధ సంయమాత్ = సంబంధమందు సంయమముఁజేయుటవలన గాని, లఘుతూల సమాపత్తేశ్చ. లఘు = తేలికయైనట్టి వస్తువులయొక్క, తూల = దూదియొక్కయు, సమాపత్తేః = తన్మయీ భావమువలన, ఆకాశగమనమ్ = ఆకాశమందు విహరించుట, జలమందు నడచుట సిద్ధించును. ఈ సిద్ధికే లఘిమయందురు. ఇది అష్ట సిద్ధులలో నొకటి

తా॥ లఘుతూల సమాపత్తియనగా తేలికయైన పదార్థములు, దూది మొదలగు వాటియందు చిత్తమును లగించి, తదితరము గోచరించుకుండుట దీనినే తన్మయీ భావమందురు. భగవంతునియందు తన్మయము జెందుటవంటిది ఈ సమాపత్తి శబ్దార్థము 36-వ సూత్రములో వ్యాఖ్యానింపబడినది.

సూ॥ 138. బహిరకల్పితావృత్తిః మహావిదేహా తతః ప్రకాశావరణ క్షయః.

బహిః = శరీరమునకు బాహ్యమందు, అకల్పితా = కల్పితముగాని, వృత్తిః = వృత్తి మహావిదేహాయనబడును తతః = దానివలన, ప్రకాశావరణ క్షయః = ప్రకాశ = బుద్ధిసత్త్వముయొక్క, ఆవరణ = రజస్తమోమూలమైన క్లేశకర్మవిపాకత్రయముయొక్క, క్షయః = క్షయముసిద్ధించును.

తా॥ అస్మదాదులకు మనస్సు శరీరమందే ప్రతిష్ఠితమై బయట సంచరించుచుండును. యోగుల కాచిత్తము, దేహమునువీడి బహిః ప్రతిష సంపాదించుకొనగలుగును. అట్టి శక్తి మహావిదేహా యనబడును. ఆశక్తి వలన, క్లేశకర్మవిపాకములన్నియు నశించును.

సూ ॥ 139. స్థూలస్వరూపసూక్ష్మాన్వయార్థవత్త్వ సంయమాత్ భూత జయః.

స్థూలసంయమాత్ = పంచభూతములయొక్క, స్థూలత్వముయొక్క, స్వరూపముయొక్క, సూక్ష్మత్వము యొక్క, అన్వయముయొక్క, అర్థవత్త్వము యొక్క సంయమమువలన, భూత జయః = పంచభూతముల జయము సిద్ధించును.

తా॥ పంచభూతముల యొక్క ప్రథమరూపము గంధాదులు అనగా పృథివికి గంధము, ఉదకమునకు రసము మొదలగునవి - వీటిని స్థూలములందురు. పృథివ్యాదులు స్వరూపమనబడును. వాటితన్మాత్రలు సూక్ష్మరూపము. సత్త్వరజస్తమోగుణములు ఆ భూతములయొక్క అన్వయమనబడును ఈ భూతముల యొక్క ఐదవరూపము వాటి అర్థవత్త్వము అనగా నవి భోగాపవర్గార్థము ఏర్పడినవి. వీటియందు అనగా స్థూలస్వరూపాదులయందు సంయమము జేసిన ఆ భూతముల జయము సిద్ధించును. పంచభూతములయందుండెడి స్థూలస్వరూపాది పంచ రూపములయందు సంయమము జేసిన యోగి భూతములను జయించు నన్నమాట

సూ ॥ 140. తతో అణిమాదిప్రాదుర్భావః కాయసంపత్ తద్ధర్మానభి ఘాతశ్చ.

తతః = ఆ భూత జయమువలన, అణిమాదిప్రాదుర్భావః అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యం ఈశత్వం, వశిత్వము అను పేరుగల అష్ట సిద్ధులు గలుగును. దీనినే 'కాయసంపత్' అందురు. ఇది కలిగిన యోగికి, తద్ధర్మానభిఘాతశ్చ. తత్ = ఆయా భూతములయొక్క ధర్మ = ధర్మములచేత, అనభిఘాతశ్చ = హానికలుగుట జరుగదు.

తా॥ అణిమా అనగా సూక్ష్మరూపమునొందుట; మహిమా = పెద్దరూపమునుధరించుట; లఘిమా = బాగా తేలికగానగుట, గరిమా = చాలాబరువు కలిగియుండుట. ప్రాప్తిః = వ్రేలుతో చంద్రునితాకుట

వంటిసిద్ధి, ప్రాకామ్యం = పదికోరుకున్న అది సిద్ధించుట. అనగా భూమి నుండి ఎగురుశక్తి, జలమందుమునిగియుండు శక్తి ఇట్టి శక్తులు సిద్ధించును. వశిత్వం = భూత భౌతిక వశీకరణము. ఈశిత్వం=భూత భౌతికములకు అధిపతిగానుండు శక్తి. ఈ ఎనిమిది శక్తులు కలిగినవానిని పంచభూతములు ఏమియు జేయలేవు. నీటిలో మునిగినను జావడు. పర్వతాగ్రములనుండి పడినను దెబ్బతినడు. ఇదియే 'తద్ధర్మానభిఘాత.' అనుశక్తి.

సూ॥ 141. రూపలావణ్య వజ్రసంహననత్వాని కాయసంపత్.

కాయ సంపత్ అనగా రూప ...సంహననత్వాన్ని ...రూప = రూపము, లావణ్య = లావణ్యము అనగా కాంతి మత్త్వము, వజ్ర సంహననత్వాని = వజ్రమువంటి శరీరము కల వాడగుట.

సూ॥ 142. గ్రహణస్వరూపాఽస్మితాన్వయార్థవత్త్వసంయమాదింద్రియజయః.

గ్రహణ = శబ్దాది విషయములను గ్రహించు ఇంద్రియ వృత్తులందు, స్వరూప = ఇంద్రియములకు ప్రకాశము కలిగించు బుద్ధిసత్త్వము, దీనియందు అస్మితా = అహంకారవృత్తియందు, అన్వయార్థవత్త్వ = సత్త్వరజస్తమోగుణములందు పురుషుని ప్రవేశింపజేయు ఇంద్రియశక్తి. దీనియందు సంయమాత్ = సంయమమువలన, ఇంద్రియజయః = ఇంద్రియ జయము సిద్ధించును

తా॥ 141వ సూత్రములో కాయ సంపత్ జెప్పబడినది. ఈ సూత్రమందు జెప్పబడిన ఇంద్రియ జయమును ఇంద్రియ సంపత్ అని జెప్పదగును. ఇంద్రియము లేవిధమున పురుషుని అర్థములందు ప్రవేశింప జేయుచున్నవో తద్రీతియందు సంయమమును జేసిన నింద్రియ జయము సిద్ధించును.

సూ ॥ 143. తతో మనోజవిత్వం వికరణభావః ప్రధానజయశ్చ.

తతః = ఆ ఇంద్రియ జయము తరువాత, మనోజవిత్వం = మనోవేగముతో నెక్కడకు బోవలె నన్న నచ్చటికి శరీరము వెళ్లుట, వికరణభావః = ఇంద్రియావశ్యకతలేకయే ఇచ్చవచ్చిన దేశమును మనోనేత్రమున జూడగలుగుట ( Clairvoyance ), భూత భవిష్యత్తులను జూచుట, ఈ ప్రకారము ప్రధాన జయశ్చ = సర్వ ప్రకృతి వికారములను వశీకరించుకొనుట (వర్షములనాపు జేయుట, వర్షములను గురిపించుట, గ్రహగతుల నాపుజేయుట, మొదలగు శక్తులు కలుగును. ఈ మూడుశక్తులను అనగా మనోజవిత్వము, వికరణభావము, ప్రధాన జయము అనువానిని 'మధుప్రతీక' లందురు. ఇవి ఇంద్రియ జయము వలన సిద్ధించు శక్తులు

సూ ॥ 144 సత్త్వ పురుషాన్వతా ఖ్యాతిమాత్రస్య సర్వ భావాధిష్ఠాతృత్వం సర్వ జ్ఞాతృత్వం చ.

సత్త్వపురుషాన్యతాఖ్యాతిమాత్రస్య = సత్త్వ = బుద్ధిసత్త్వము. పురుష = పురుషుడు, అన్యతా = ఈ రెండువేఱు అను ఖ్యాతిమాత్రస్య = వివేకఖ్యాతిగల యోగికి, సర్వభావాధిష్ఠాతృత్వం సర్వభావ = యావత్ప్రకృతికి, అధిష్ఠాతృత్వం = వశీకరించుకొను శక్తి, సర్వజ్ఞాతృత్వం చ = సమస్త విషయములను భూతభవిష్యద్విషయములను తెలిసికొనుటగూడ సిద్ధించును.

తా ॥ అట్టి యోగి సాక్షాజ్జీవన్ముక్తుడై, కామాన్నియై, కామరూపియై, సర్వత్ర స్వేచ్ఛావిహారము కలవాడగును

సూ. 145 తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్.

తద్వైరాగ్యాదపి, తత్ = ఆ మూశక్తులయందుగూడ వైరాగ్యము వలన దోషబీజక్షయే = దోషబీజమైన ప్రకృతిబంధములు క్షీణించగా, కైవల్యం = మోక్షమే సిద్ధించును.

తా॥ యోగికికలిగిన శక్తులను పరుల వశీకరించుటలో దుర్విని యోగము జేసిన కైవల్యము సిద్ధించక ప్రకృతిలోనుండిపోవును. అట్లు గాక, కలిగిన సిద్ధులందు వైరాగ్యము కలిగిన సాక్షాత్కైవల్యసిద్ధిని బొందును.

సూ॥ 146 స్థాన్యుపనిమంత్రణే సంగస్మయాకరణం పునరనిష్ట ప్రసఙ్గాత్.

స్థాన్యుపనిమంత్రణే ...స్థాని = దేవతలయొక్క, ఉపనిమంత్రణే = స్వర్గ భోగములననుభవింప నాకర్షించగా, సంగస్మయాకరణం = తద్భోగములందు సంగమునుజూపు సంతోషమును పొందకుండుట, ఎందువలన, పునః = తిరిగి, అనిష్టప్రసఙ్గాత్ = అనిష్టములైన సంసారభోగప్రసంగములవలన

తా॥ పూర్వవిధముగ జితేంద్రియుడై ప్రకృతిని జయించిన యోగిని, దేవతలు స్వర్గభోగాసక్తుని జేయుటకు యత్నించెదరట. అట్టి స్వర్గ భోగములుగూడ నశ్వరములే గావున, వాటిని తృణీకరించుటయే పూర్వసూత్రమందు జెప్పిన కైవల్యలక్షణము

సూ॥ 147 క్షణతత్క్రమయోః వివేకజం జ్ఞానమ్.

క్షణ = క్షణములందును, తత్క్రమయోః = ఆక్షణములయొక్క క్రమమందును సంయమముజేయగా, వివేకజం = వివేకమువలనబుట్టిన, జ్ఞానమ్ = జ్ఞానముదయించును.

తా॥ ఒకక్షణము మరియొకక్షణము ఏకకాలమందుండవు ఒకక్షణము వెంబడి మరియొక క్షణము జరుగుచుండును. కాలము మూడువిధములు. (1) మహాకాలము అనగా లోకములకు ప్రళయము కలిగించునది (2) కలనాత్మక కాలము అనగా మానవుడు కొలువదగిన కాలము. (3) సూక్ష్మకాలము మానవుడు కొలువలేని కాలము. మానవుడు మహాకాలమును గొలవలేడు; సూక్ష్మకాలమునుగొలవ

లేడు. కనురెప్పపాటు కాలమని, తామరాకును సూదితో నెంతకాలములో బొడువవచ్చునో నట్టిత్రుటియనుకాలమని మానవుఁడు గొలువదగిన సూక్ష్మకాలములు. వీటిలో కోట్యంశము, అర్బుదాంశముగల కాలముగూడ నుండును. ఈ సూక్ష్మాతిసూక్ష్మ కాలమునకు ఇయత్తా లేదు అనగా ఈ మహాసూక్ష్మ కాలము ఎంతో కొంత (యావత్తావత్) అందురు అనగా 'య' అను అక్షరముతో సంకేతింతురు) అనగా 'య' అనుకొనుము దానిలోగూడ అర్బుదాంశముండునుగదా. తిరిగి ఆ యర్బుదాంశమును 'య' అనుకొనుము. తిరిగి దానిలోగూడ నర్బుదాంశముండునుగదా. కావున మనము నిర్వచింపలేని సూక్ష్మమైన కాలముండునుగదా. అట్టి సూక్ష్మతమ కాలము వెంబడి మఱియొక సూక్ష్మతమ కాలము నడచుచుండును. దీనినే కాలక్రమమందుము. కావున ఆసూక్ష్మాతిసూక్ష్మ కాలమందును అట్టికాలముల క్రమమందును (Consecutiveness) సంయమము జేయువానికి వివేకమువలన బుట్టు జ్ఞానము బుట్టునట! ఈ సూక్ష్మాతిసూక్ష్మ కాలమును నవీన గణితశాస్త్రములో నొకసరళ రేఖనుఖండించు Dedekind's cut అనుఖండన బిందు సూచితవ్యవధితుల్యమైన కాలముతో బోల్చవచ్చును. ఈకాలప్రవాహమునుగూర్చి అరుణమందు ఒకచక్కని వర్ణనగలదు. ఏ ప్రకారము ఒకానొకస్థలమందు బయలుదేరిన కొద్ది జలప్రవాహముతో, మఱికొన్ని ప్రవాహములుగలసి నదులై ప్రవహించుచు నిమ్నాభిముఖముగా బోయి, వెనుకకు ప్రవహించవో అట్లే సూక్ష్మాతిసూక్ష్మ కాలములుగలసి సంవత్సరాత్మక కాలముగా నేర్పడి పురఃప్రవాహము కలిగి వెనుకకు మళ్ళదు. నిమ్నాభిముఖత్వధర్మమునదులకెట్టిదో భవిష్యద్భిముఖ కాలము నట్టిదే యను ఉపమానము మిక్కిలి సమంజసమైనది. అందుచేతనే కాల ప్రవాహమనుభావము లోకమందేర్పడినది.

సూ॥ 148. జాతిలక్షణదేశైః అన్యతానవచ్ఛేదాత్ తుల్యయోస్తతః ప్రతిపత్తిః.

తతః = అందువల్ల, జాతిలక్షణదేశైః = జాతిచేతను లక్షణముచేతను, దేశముచేతను, అన్యతానవచ్ఛేదాత్ . అన్యత = అన్యత్వమైన, అనవచ్ఛేదాత్ = భేదశూన్యత్వమువలన, తుల్యయోః = రెండు తుల్యవస్తువులయొక్క, ప్రతిప్రత్తిః = జ్ఞానము కలుగును.

తా॥ రెండువస్తువులు తుల్యములని చెప్పిన, వాటికి జాతి భేదముగాని, లక్షణభేదముగాని, దేశభేదముగాని ఉండరాదు ఎట్లనగా గోవునకు, మహిషమునకు జాతిభేదముగలదు. గావున తుల్యములు గావు. రెండుగోవులకు భేదజ్ఞానము వాటిలక్షణమువల్ల చెప్పవచ్చును, ఎట్లనగా కపిలగోవు వెల్లయావు. జాతిలక్షణభేదములు లేకున్నను. దేశభేదము చేతగూడ భేదజ్ఞానము కలుగును ఎట్లనగా రెండు ఉసరి కాయలు సమానరూప పరిమాణములో నున్నప్పటికి భిన్నప్రదేశమందున్నచో భేదజ్ఞానముకలుగును అట్లుగాక రెండు తెల్లని పార్థివపరమాణువులేక దేశమందున్నప్పుడు వాటిభేదము గుర్తించలేము. అట్టివాటి భేదమందు సంయమముచేసిన భేదజ్ఞానముకలుగునన్నమాట. దీని విషయములో నొకగణితశాస్త్రీయభావముగలదు అది యేదనిన ఒక సరళరేఖమీద రెండు క్రమబిందువులనెడివికలవా, లేవా యనుప్రశ్నకు సమాధానముచెప్పలేము. ఉన్నవియని చెప్పినచో ఆ రెండు క్రమబిందువులు ( Consecutive ) మధ్యదేశమున నంతముగా విభజింప వీలగును గావున అనంత బిందువులు వాటిమధ్యనుండుటచేత ఆ బిందువుల క్రమత్వము బోవును రెండు క్రమబిందువులు లేవన్నచో నా బిందువుల కైక్యత సిద్ధించును. క్రమబిందువులు లేవన్నచో నది సరళరేఖ గానేరదు. కావున ఈయుదాహరణము ' వికల్పమను ' వృత్తికిచక్కని యుదాహరణము శబ్దజ్ఞానాను పాతీవస్తుశూన్యో వికల్పః అని చెప్పుటచేత క్రమబిందువులు అను శబ్దప్రయోగమున్నదేగాని అచ్చట

వస్తువులేదు అనగా వస్తుశూన్యత చేత వికల్పమైనది. న కల్ప్యతే ఇతి వికల్పః Which does not hold good అనుమాట

సూ॥ 149 తారకం సర్వవిషయం సర్వథావిషయం అక్రమం చేతి వివేకజజ్ఞానమ్

తారకం=ప్రాతిభజ్ఞానము (Spiritual intuition) ఇది సర్వవిషయం = సమస్తము విషయముగా గలది అనగా అన్ని విషయములు తారకమునకు గోచరించును సర్వథావిషయం = అతీతానాగత ప్రత్యుత్పన్న సర్వవిషయములు గలది మఱియు అన్ని విధములైన విషయములు దానికి గోచరించును అక్రమం = ఏక కాలమందే సర్వవిషయములు ప్రాతిభమునకు గోచరించును

సూ॥ 150 సత్త్వపురుషయోః శుద్ధిసామ్యే కైవల్యమ్

సత్త్వపురుషయోః = బుద్ధిసత్త్వమునకు, పురుషునకు శుద్ధిసామ్యే = సమానశుద్ధి కలుగుచుండగా, కైవల్యం = కైవల్యము సిద్ధించును

తా॥ రజస్తమోగుణశూన్యమైన సాత్త్వికబుద్ధికి బుద్ధిసత్త్వమని పేరు బుద్ధికి రజస్తమోమలము పూర్ణముగా నశించినప్పుడున్నూ కైవల్యము సిద్ధించును అనగా బుద్ధికి కర్తృత్వాభిమానము నశించగా పురుషునికి దృశ్యమందాస నశించగా బుద్ధిసత్వమునకు, పురుషునికి సమానమైన శుద్ధి ఏర్పడినదన్న మాట ఆ స్థితినే కైవల్యమందురు వైరాగ్యము యొక్క పరాకాష్ఠ అట్టి స్థితియందే కలుగును.

విభూతిపాదము సమాప్తము

---